తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
21-06-2026
ఆదివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 133
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575



## వైద్య ఆరోగ్యశాఖలో అసాధారణ బదిలీలు!

బదిలీలపై బ్యాన్ విధించాక బదిలీల ఉత్తర్వులు
నిబంధనల్లో మార్పులు
ముందు నాలుగేళ్లు బదిలీలిచ్చారు..
ఇప్పుడు మూడేళ్ల పరిమితితో బదిలీలకు సిద్ధం
ఒక్క వైద్య ఆరోగ్యశాఖకే వెసులు బాటు ఎందుకు?
జీవో 38 ను ఉల్లంఘిస్తూ దరఖాస్తులు
ఉన్నతాధికారుల తీరుపై సమగ్ర విచారణకు డిమాండ్

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్**

తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో జరుగుతున్న సాధారణ బదిలీల ప్రక్రియ తీవ్ర వివాదాస్పదంగా మారింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో మే 31 లోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టమైన గడువు విధించినప్పటికీ, వైద్య ఆరోగ్యశాఖలో మాత్రం గడువు ముగిసేవరకు ఒక్క అధికారి బదిలీ ఉత్తర్వు కూడా వెలువడకపోవడం గమనార్హం. సాంకేతిక లోపాలు, పరిపాలనా జాప్యం అని అధికారులు పైకి చెబుతున్నప్పటికీ, ఈ ఆలస్యం వెనుక పెద్ద ఎత్తున తెరవెనుక రాజకీయాలు, పైరవీలు సాగాయనే ఆరోపణలు ఆ శాఖలోనే

మిగతా 3వ పేజీలో..

# నీట్ రీటెస్ట్‌కు మిలిటరీ పహారా..!



లీకేజీ మాఫియాకు గట్టి దెబ్బ!
'ఐరన్ ఫోర్ట్రెస్' భద్రతలో నీట్ పరీక్ష
నేడే అసలు సిసలైన పోరు..
లీకుల కోటలు బద్దలు.. నీట్ పునర్ పరీక్షకు పకడ్బందీ వలయం
టెలిగ్రామ్‌కు బ్రేక్.. టెక్నాలజీకి చెక్
సరికొత్త వ్యూహంతో 'ఎన్‌టీఏ'



**(ప్రత్యేక ప్రతినిధి - సిరిన్యూస్)**

నీట్ పునర్ పరీక్ష అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం, జాతీయ పరీక్షా సంస్థ యుద్ధప్రాతిపదికన ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాయి. గత లీకేజీల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ఎలాంటి లూప్‌హోల్స్‌కు తావులేకుండా మిలిటరీ స్థాయి భద్రతతో కూడిన నిఘా వ్యవస్థను రంగంలోకి దించాయి. ఈనెల 21న మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:15 గంటల వరకు జరగనున్న ఈ మహా పరీక్ష కోసం అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. గత మే 3న జరిగిన తొలి పరీక్ష లీకేజీ వివాదాల వల్ల రద్దు కావడం, విద్యార్థుల్లో తీవ్ర అనిశ్చితి నెలకొనడంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నేతృత్వంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పరీక్షల పారదర్శకతను, దేశవ్యాప్తంగా ఉన్న 22 లక్షల మందికి పైగా విద్యార్థుల నమ్మకాన్ని పునరుద్ధరించడమే లక్ష్యంగా ఈసారి సరికొత్త రక్షణ ప్రోటోకాల్స్‌ను అమలు చేస్తున్నారు.

**భారత వైమానిక దళం రక్షణలో ప్రశ్నపత్రాలు...**

దేశ చరిత్రలోనే మొదటిసారిగా, నీట్ ప్రశ్నపత్రాల రవాణా బాధ్యతను భారత వైమానిక దళానికి (ఐఏఎఫ్) అప్పగించారు. సాధారణ పోస్టల్ నెట్‌వర్క్‌ల

మిగతా 2వ పేజీలో..

## నకిలీ సర్టిఫికెట్లపై విచారణ కమిటీ!

- 'సిరి న్యూస్' పరిశోధనాత్మక కథనానికి ఎఫెక్ట్
- నకిలీ సర్టిఫికెట్లపై కమిటీ వేసిన సీఎండీ
- 2020 తర్వాత నియామకాలపై నిఘా





'చదవని చదువుకు పట్టాల'పై టీజీఎస్పీడీసీఎల్ యాజమాన్యం యాక్షన్




## గాజు ఛాంబర్ల స్లీపర్ బస్సులపై రవాణా శాఖ ఉక్కుపాదం..

- మూడు వాహనాలు సీజ్
- నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేట్ స్లీపర్ బస్సులు



**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

ప్రైవేట్ స్లీపర్ బస్సులలో ప్రయాణికుల భద్రతకు విఘాతం కలిగించేలా

మిగతా 3వ పేజీలో..



## నరహరి ఆస్తులు 180 కోట్లు!

- 4 కిలోల బంగారం.. 2 కోట్ల 65 లక్షల నగదు
- 12 బంగారు బిస్కెట్లు.. చాల చోట్ల స్థిరాస్తులు!
- లెక్క తేల్చిన ఏసీబీ

**తెలంగాణ బ్యూరో సిరి న్యూస్:**

తెలంగాణాలో సంచలనం సృష్టించిన ల్యాండ్స్ అండ్ రెవిన్యూ డిప్యూటీ డైరెక్టర్ నరహరి కి సంబందించిన రెండు లాకర్ల కీస్ లేకపోవడంతో కోర్టు అనుమతితో ఏసీబీ అధికారులు రెండు లాకర్లను పగలగొట్టారు. లాకర్లలో రెండు కిలోల

మిగతా 2వ పేజీలో..

## కాంగ్రెస్ నేతలను నిలదీయాలి

ప్రతీ గింజను కొనేదాకా వెంటాడుతూనే ఉంటాం
ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి కేటీఆర్ పరామర్శ
పాండురంగ కుటుంబానికి రూ.3 లక్షల సాయం

**ఆదిలాబాద్, జూన్ 20 సిరిన్యూస్:**

రాష్ట్రంలో పంటల కొనుగోళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం రైతాంగానికి శాపంగా మారనుందని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంటలు కొనుగోలు

మిగతా 2వ పేజీలో..





## సాగునీటి సమస్య పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి
రాజీవ్‌గాంధీ ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన

**సూర్యాపేట, జూన్ 20 సిరిన్యూస్:**

కృష్ణా నది ఒడ్డున నివసిస్తున్నప్పటికీ సాగునీటి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతులకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా దొండపాడు

మిగతా 3వ పేజీలో..

## ప్రియుడి కోసం కన్నకొడుకును చంపిన కసాయి తల్లి

- ఏడుస్తున్నాడని రెండేళ్ల బాలుడిపై దారుణం
- ఫిట్స్‌తో చనిపోయాడంటూ కుటుంబాన్ని నమ్మించిన తల్లి
- 20 రోజుల తర్వాత బయటపడిన హత్య రహస్యం
- నిందితురాలు అరెస్ట్.. పరారీలో ప్రియుడు



**సిద్దిపేట, జూన్ 20 సిరిన్యూస్:**

సిద్దిపేట జిల్లాలో మానవత్వాన్ని మంటగలిపే ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రియుడితో ఉన్న సమయంలో అడ్డుగా వస్తున్నాడనే కారణంతో

మిగతా 3వ పేజీలో..




## విద్య, సంక్షేమం, ఉపాధితో బీసీల సాధికారత

- టెన్త్‌లో రాష్ట్ర సగటును అధిగమించిన బీసీ హాస్టల్ విద్యార్థులు
- విద్యా వికాసానికి ప్రతి హాస్టల్ కేంద్రంగా మారాలి
- సిద్దిపేటలో బీసీ స్టడీ సర్కిల్ భవనం త్వరలో ప్రారంభం
- బీసీ సంక్షేమ శాఖ పనితీరుపై మంత్రి పొన్నం సమీక్ష

2

## బండి భగీరథ్‌కు మధ్యంతర బెయిల్

ఇంజనీరింగ్ పరీక్షల నేపథ్యంలో కోర్టు నిర్ణయం
నెల 26 వరకు షరతులతో కూడిన ఉపశమనం
పోక్సో కేసులో నెలరోజులకు పైగా జైలు జీవితం
పోలీసులకు లొంగిపోయిన తర్వాత రిమాండ్‌కు వెళ్లిన భగీరథ్

**హైదరాబాద్,సిరిన్యూస్:**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు న్యాయస్థానంలో ఊరట లభించింది.

మిగతా 2వ పేజీలో..



# నకిలీ సర్టిఫికెట్లపై విచారణ కమిటీ!

**సిరి న్యూస్, తెలంగాణ బ్యూరో:**

టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ కొందరు నకిలీ సర్టిఫికెట్ల ద్వారా ఉద్యోగులుగా నియామకమైన విషయాన్ని 'చదవని చదువుకు పట్టా!' అనే శీర్షికన ప్రచురించిన వార్తకు టీజీఎస్పీడీసీఎల్ యాజమాన్యం స్పందించింది. ఈ మేరకు 2020 తర్వాత నియామకమైన జేఎల్ఎంల విద్యార్హత పత్రాలను పరిశీలించడానికి ఒక కమిటి ని నియమిస్తూ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్ ఉత్తర్వులు జారీచేశారు. సంగారెడ్డి కేంద్రంగా నకిలీ సర్టిఫికెట్ల ఉదంతం సిరి న్యూస్ వెలుగులోకి తీసుకువచ్చింది. కొందరు అక్రమ మార్గాల ద్వారా ఆ తర్వాత జరిగిన సిరి నిఘా పరిశోధనలో ప్రమోషన్ ల కోసం, కన్వర్షన్ ల కోసం సైతం నకిలీ సర్టిఫికెట్లు వినియోగించినట్టు తేలింది. ఈ విషయాన్ని సైతం సిరి వెలుగులోకి తెచ్చింది. వాస్తవాలను పరిశీలించిన టిజిఎస్పీడీసీఎల్ యాజమాన్యం దివిషనల్ ఇంజనీర్ ఛైర్మెన్ గా కమిటీ ని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

**మొదటగా జెపల్ఎమ్.. ఆపై మిగితా వాళ్ళ సర్టిఫికెట్ల పరిశీలిన**

2020 తర్వాత నియామకం చేయబడ్డ జెపిఎల్ఎంల సర్టిఫికెట్ల పరిశీలిన పూర్తైన తర్వాతే మిగితా అనుమానిత సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిసింది. కింది స్థాయి నుండి పరిశీలన మొదలై పై స్థాయికి వెళ్లేందుకు వీలుగా ఈ ఉత్తర్వులు వెలువడ్డట్టు సమాచారం

**విజిలెన్స్ అధికారి పరిశోధనే కీలకం**

సంగారెడ్డి కేంద్రంగా జరిగిన అవినీతి విషయంలో ఓ విజిలెన్సు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇచ్చిన నివేదిక కీలకంగా మారింది. సంగారెడ్డి సర్కిల్ లోని కొందరు నకిలీ సర్టిఫికెట్ల తో నియామకం అయ్యారన్న విషయం తెలిసి అయన తనదైన శైలిలో చేసిన విచారణ లో ఎన్నో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.ఒక్క జేఎల్ఎం లే కాక విద్యుత్ శాఖలోని పలు విభాగాల్లోని ఉద్యోగుల సర్టిఫికెట్లపై విచారణ జరిపారు. ఈ మేరకు కరీంనగర్ కేంద్రంగా ఉన్న స్టడీ సెంటర్లను జల్లెడ పట్టారు. అందులో ఎన్నో ఆసక్తి కరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయని సమాచారం. పోలీస్ శాఖలో ఎన్నో నేర పరిశోధనల్లో కీలకంగా వ్యవహరించిన ఆ అధికారి నివేదిక ఇప్పుడు జరగబోయే సర్టిఫికెట్ల తనిఖీల్లో కీలకం కానుంది. ఇటీవలే పదోన్నతి పొందిన ఆ అధికారి అత్యుత్తమ ప్రతిభే ఫేక్ ఉద్యోగుల విషయంలో యాజమాన్యం మరింత కఠినంగా వ్యవహరించడానికి కారణమైంది.

# బండి భగీరథ్‌కు మధ్యంతర బెయిల్

**మొదటిపేజీ తరువాయి**

ఓ యువతిపై లైంగిక దాడి ఆరోపణలకు సంబంధించి నమోదైన కేసులో అరెస్టై జైలులో ఉన్న భగీరథ్‌కు మల్కాజ్‌గిరి కోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఇంజనీరింగ్ పరీక్షలు రాయాల్సి ఉన్నందున మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని భగీరథ్ తరఫు న్యాయవాదులు కోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం ఈ నెల 26 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత నెలలో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీసింది. కేసు నమోదు అనంతరం అతడిని అరెస్టు చేయాలంటూ పలు నిరసనలు కూడా జరిగాయి. కొన్ని రోజుల పాటు అజ్ఞాతంలో ఉన్న భగీరథ్ మే 17న పోలీసులకు లొంగిపోయాడు. అనంతరం పేట్‌బషీరాబాద్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ నిర్వహించారు. రెండు గంటలకు పైగా ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు ప్రశ్నించిన తర్వాత న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

# నరహరి ఆస్తులు 180 కోట్లు!

**మొదటిపేజీ తరువాయి**

50 తులాల బంగారం కోటి 50 లక్షల నగదు, 12 బంగారు బిస్కెట్లు లభించినట్టు ఏసీబీ అధికారులు వెల్లడించారు. దింతో పాటు ఇంట్లో దొరికిన నగదు 1 కోటీ 54 లక్షల రూపాయలు, బ్యాంక్□లో ఫిక్స్డ్ డిపాజిట్స్ 5 కోట్లు, బ్యాంక్ బ్యాలెన్స్ 2 కోట్లు ఏసీబీ గుర్తించింది. మొత్తం బంగారం 4 కిలోలు, 8 కిలోల వెండి, 15 చోట్ల ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు లెక్క తేల్చారు. సైబరాబాద్‌లో బిల్డింగులు, అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు, నరహరి భార్య పేరిట రెండు బ్యాంక్ లాకర్లు ఉన్నాయి. ఆస్ట్రేలియాలో నివాసం ఉంటున్న కుమారుడు, అత్తమామల పేరిట రిజిస్ట్రేషన్ చేసిన ఆస్తుల డాక్యుమెంట్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుత మార్కెట్‌వ్యాల్యూ ప్రకారం ఈ ఆస్తుల విలువ సుమారు రూ.180 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. నరహరిని అరెస్ట్ చేసి.. ఏసీబీ స్పెషల్ కోర్టులో హాజరుపరచగా 14 రిమాండ్ విధించారు. కాగా, 2025 ఆగస్టులో మల్టీ జోన్ 2 డిప్యూటీ డైరెక్టర్‌గా నరహరి పదోన్నతి పొందాడు. ప్రభుత్వ, ప్రైవేట్ భూముల సర్వేలకు సంబంధించి నరహరిపై తీవ్ర అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఇటీవలి కాలంలో భూముల అమ్మకాలకు సంబంధించిన సర్వేల సమయంలోను భారీగా అవకతవకలకు పాల్పడినట్టు తెలిసింది. ఇందులో భాగంగా నరహరికి ఇటీవల పెద్ద మొత్తంలో నగదు చేరినట్టు ఏసీబీకి సమాచారం అందింది. ఈ సమాచారంతో తనిఖీలు చేయగా నరహరి అక్రమాస్తుల గుట్టు బయటపడింది.

**నరహరి కూడబెట్టిన ఇళ్లూ, భూముల చిట్టా ఇది..**

* ఛత్రినాకలో ఇల్లు, గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో బిల్డింగ్
* రంగారెడ్డి జిల్లాలో ఐదు ఓపెన్ ప్లాట్లు
* మహేశ్వరంలో 1.24 ఎకరాల వ్యవసాయ భూమి
* పుప్పాలగూడలో హైరైజ్ బిల్డింగ్(2,500 ఎస్ఎఫ్టీ)
* నార్సింగిలో రెండు హైరైజ్ బిల్డింగ్స్(ఒక్కోటి 1,860 ఎస్ఎఫ్టీ)
* రాజేంద్రనగర్‌లో రెసిడెన్షియల్ ఫ్లాట్

# ఏసీబీ దాడుల్లో భారీ అక్రమాస్తుల బట్టబయలు

- **ఇప్పటికే రూ.30 కోట్లకు పైగా ఆస్తుల వెలికితీత**

**హైదరాబాద్, జూన్ 20 సిరిన్యూస్:**

ప్రభుత్వ విభాగాల్లో అవినీతిపై అవినీతి నిరోధక శాఖ ఉక్కుపాదం మోపుతోంది. సర్వే, ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సుంకరి నరహరి రావుకు సంబంధించిన అక్రమాస్తుల కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగుచూస్తున్నాయి. తాజాగా నిర్వహించిన తనిఖీల్లో భారీ మొత్తంలో నగదు, బంగారం బయటపడటం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దర్యాప్తులో భాగంగా హైదరాబాద్‌లోని షాలిబండ ప్రాంతంలోని కెనరా బ్యాంకులో ఉన్న నరహరి రావు వ్యక్తిగత లాకర్‌ను ఏసీబీ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా లాకర్‌లో రూ.1.5 కోట్ల నగదు, సుమారు 2.5 కిలోల బంగారం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన కేసులో ఇవి కీలక ఆధారాలుగా మారనున్నట్లు తెలుస్తోంది. ఇంతకుముందు నరహరి రావుకు చెందిన నివాసాలు, కార్యాలయాలు, బంధువుల ఇళ్లలో నిర్వహించిన సోదాల్లో సుమారు రూ.30 కోట్లకు పైగా విలువైన ఆస్తులను అధికారులు గుర్తించారు. వీటిలో భారీ మొత్తంలో నగదు, విలువైన భూములు, ఖరీదైన గృహాలు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. అక్రమాస్తుల కేసులో లభించిన ఆధారాల ఆధారంగా నరహరి రావును ఏసీబీ అధికారులు ఇప్పటికే అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ కస్టడీకి తరలించింది. అయితే అక్రమార్జనకు సంబంధించిన వివరాలు ఇంకా వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. నరహరి రావు పేరు మీద లేదా ఆయనకు సంబంధం ఉన్న ఇతర బ్యాంక్ లాకర్లను కూడా తనిఖీ చేసేందుకు ఏసీబీ సన్నాహాలు చేస్తోంది. ఈ కేసులో మరెవరి ప్రమేయం ఉందనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. మరిన్ని ఆస్తుల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఏసీబీ వర్గాలు చెబుతున్నాయి.

# కాంగ్రెస్ నేతలను నిలదీయాలి

**మొదటిపేజీ తరువాయి**



చేయకుంటే కాంగ్రెస్ నాయకుల కాళ్లు పట్టుకోవద్దని, వారి కాలర్ పట్టుకుని నిలదీయాలని రైతులకు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామానికీ ప్రభుత్వ నిర్ణయాన్ని తీసుకెళ్లాలని, రైతులను చైతన్యవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. తన జొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ఆదిలాబాద్ జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న రైతు పాండురంగ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం పార్టీ జనరల్ బాడీ సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఇటీవలి కేబినెట్ సమావేశపు నిర్ణయంపై ఆయన తీవ్ర స్థాయిలో స్పందించారు. ఇప్పటికే మూడుసార్లు రైతుబంధును ఎగగొట్టిన రేవంత్ రెడ్డి మరోసారి పంటలు అదనంగా కొనుగోలు చేయమని నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆనాడు సమైక్యాంధ్రలో తెలంగాణ రైతులను అరిగోసపెట్టిన రోజులను రేవంత్ రెడ్డి మరోసారి గుర్తు చేస్తున్నారన్నారు. అనాడు రైతు ఆత్మహత్యల్లో మహారాష్ట్ర నెంబర్ వన్‌లో ఉంటే తెలంగాణ నంబర్ 2లో ఉండేదన్నారు. అంతటి దుర్భరమైన పరిస్థితి నుంచి తెలంగాణలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చిన కేసీఆర్ పాలనను కేటీఆర్ గుర్తు చేశారు. గత ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ వస్తే రైతుబంధుకు రామ్ రామ్ చెబుతుంది అని కేసీఆర్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర మంత్రివర్గం ప్రత్యేకంగా సమావేశమై రైతాంగానికి శాపంగా మారే నిర్ణయం తీసుకుందని కేటీఆర్ ఆరోపించారు. ఇకపై రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి వడ్లు, జొన్నలు, శనగలు, కందులు, సోయాబీన్ తదితర పంటలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయబోదని, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కోటా మేరకే కొనుగోళ్లు ఉంటాయని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందని విమర్శించారు.

**15 రోజుల క్రితం చెప్పిన మాట ఏమైంది?**

మోదీ మెడలు వంచుతా.. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తా అని 15 రోజుల క్రితం చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు ఎందుకు మాట మార్చారని పశ్నించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ ఏమైంది.. హామీ ఇచ్చిన కొనుగోలు కేంద్రాలు ఎందుకు కనిపించడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం సంక్షోభంలోకి కూరుకుపోయిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో యూరియా కొరత, విద్యుత్ కోతలు, పంటల కొనుగోలు సంక్షోభం, రైతుల ఆత్మహత్యలు మళ్లీ ప్రారంభమయ్యాయని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు నిలిచిపోయిందని, రైతుల పంటల కొనుగోలుకు వినియోగించాల్సిన నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ పేరుతో రైతులను మోసం చేశారని ఆరోపించారు.

**కేసీఆర్ హయాంలో ప్రతీ గింజ కొనుగోలు**

గత ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతన్నల కోసం ముఖ్యంగా పంట కొనుగోళ్ల విషయంలో చేసిన కృషిని కేటీఆర్ వివరించారు. కేంద్ర ప్రభుత్వం కొనుగోళ్లపై అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ మంత్రివర్గంతో కలిసి దిల్లీ వెళ్లి ధర్నా చేసి రైతుల ప్రయోజనాలను కాపాడిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ నాయకత్వంలో రైతుబంధు, రైతు బీమా, రుణ మాఫీ, సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాల ద్వారా 70 లక్షల మంది రైతులకు రూ.లక్ష కోట్లకు పైగా ప్రయోజనాలు అందించామన్నారు. పంటల ఉత్పత్తిలో తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టామని, ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్‌ను అధిగమించి మొదటి స్థానంలో నిలిచామని కేటీఆర్ వివరించారు. రాష్ట్రాన్ని సాధించిందే రైతుల కోసం అని, రైతుల సంక్షేమం కోసం ఎంత చేసినా తక్కువేనని భావించి కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు.

**బీజేపీ ఎంపీలను కూడా నిలదీయాలి**

రాష్ట్రంలో ఉన్న ఎనిమిదిమంది కాంగ్రెస్, ఎనిమిదిమంది బీజేపీ ఎంపీలు రైతుల సమస్యలపై స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ ప్రజలు గెలిపించిన బీజేపీ ఎంపీని కూడా ప్రశ్నించాలన్నారు. మోదీ ప్రభుత్వం ఎందుకు కొనుగోలు చేయడం లేదు.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు వడ్లు, జొన్నలు, కందులు, సోయాబీన్ ఎందుకు కొనడం లేదు అని ప్రశ్నించాలని రైతులకు సూచించారు.

**పాండురంగ కుటుంబానికి పరామర్శ**

సిరికొండ మండలం పొన్న గ్రామానికి చెందిన రైతు పాండురంగ కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. పార్టీ తరఫున రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. పాండురంగ కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ఆయన ముగ్గురు పిల్లల విద్య, భవిష్యత్తు బాధ్యతను ప్రభుత్వమే స్వీకరించాలని, వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని, ఆత్మహత్యలకు పాల్పడి కుటుంబాలను అనాథలను చేయవద్దని సూచించారు. పాండురంగ మరణం వ్యవసాయ సంక్షోభానికి అద్దం పడుతుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.3,720 వస్తుందని ఆశించి నెల రోజులపాటు మార్కెట్ యార్డులో జొన్నల కుప్ప వద్ద పాండురంగ వేచి చూశాడ□ని, చివరకు క్వింటాల్‌కు రూ.50 లంచం అడిగే పరిస్థితి ఏర్పడగా అధికారుల నిర్లక్ష్యంతో విసిగిపోయి తన పంట కుప్పపైనే విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలో ప్రకటించిన రూ.500 బోనస్ అమలు చేయకపోవడంతో రైతులు ప్రైవేటుగా జొన్నలను క్వింటాల్‌కు రూ.2,000కే విక్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. పాండురంగ కుటుంబానికి ఉన్న రూ.1.5 లక్షల రుణం ఇప్పటికీ మాఫీ కాలేదని, రైతుబంధు మూడు విడతలు బకాయి ఉందని, రైతు బీమా ప్రీమియం చెల్లించకపోవడంతో దాదాపు ఏడు వేల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. రైతులవి ఆత్మహత్యలు కావని.. కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలని కేటీఆర్ ఆరోపించారు. రెండేళ్లు ధైర్యంగా ఉండండి. మళ్లీ కేసీఆర్ వస్తారు. ఒక్కో రైతన్నను కళ్లల్లో పెట్టుకుని చూసుకుంటారన్నారు. మీకు అండగా ఉంటాం. కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూనే ఉంటాం అని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు ప్రశాంత్ రెడ్డి, జోగు రామన్న, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, పాడి కౌశిక్ రెడ్డి, డాక్టర్ సంజయ్, పార్టీ నాయకులు జాన్సన్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ రీటెస్ట్‌కు 'మిలిటరీ' పహారా..!

**మొదటిపేజీ తరువాయి**



ద్వారా కాకుండా, వాయుసేనకు చెందిన ప్రత్యేక విమానాలు, మిలిటరీ హెలికాప్టర్ల ద్వారా దేశంలోని 18 ప్రాంతీయ జోన్లకు ప్రశ్నపత్రాలను సురక్షితంగా తరలించారు. ఈ సీల్డ్ ట్రంక్ పెట్టెలను ఎయిర్‌పోర్టుల నుండి స్ట్రాంగ్ రూమ్‌లకు, అక్కడి నుండి పరీక్షా కేంద్రాలకు తరలించే ప్రతి దశలోనూ సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్ బలగాల సాయుధ రక్షణను ఏర్పాటు చేశారు. పత్రాలను మోసుకెళ్లే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ అమర్చడమే కాకుండా, పరీక్ష ప్రారంభానికి కేవలం 45 నిమిషాల ముందే జిల్లా యంత్రాంగం, పోలీసుల సమక్షంలో వీటిని తెరుస్తారు.

**'టెలిగ్రామ్' యాప్‌పై తాత్కాలిక నిషేధం...**

సామాజిక మాధ్యమాల ద్వారా ప్రశ్నపత్రాలను విక్రయించే నకిలీ ముఠాల మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు ఐటీ మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన 'టెలిగ్రామ్' యాప్ యాక్సెస్‌ను జూన్ 22 వరకు తాత్కాలికంగా నిలిపివేసింది. పరీక్ష ముగిసిన తర్వాత పాత పోస్టులను ఎడిట్ చేసి తప్పుడు లీక్ ఆధారాలను సృష్టించకుండా ఉండేందుకు మెసేజ్ ఎడిట్ ఆప్షన్లను కూడా నియంత్రించారు. తప్పుడు పుకార్లను నమ్మకుండా విద్యార్థులకు ఎప్పటికప్పుడు నిజమైన సమాచారాన్ని చేరవేసేందుకు ఎన్‌టీఏ సొంతంగా ఒక వెరిఫైడ్ వాట్సాప్ కమ్యూనికేషన్ ఛానల్‌ను ప్రారంభించింది. ఈసారి లోపలి వ్యక్తుల ద్వారా సమస్యలు రాకుండా ఉండేందుకు సిబ్బంది ఎంపికలో కఠినమైన వడపోత చేపట్టారు. విధుల్లో పాల్గొనే ప్రతీ సీఆర్పీఎఫ్ నోడల్ అధికారి, ఇన్విజిలేటర్లపై ఎలాంటి విచారణలు పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు.

**నో-రిలేటివ్ డిక్లరేషన్...**

పరీక్షా విధుల్లో ఉండే సిబ్బంది యొక్క పిల్లలు, బంధువులు ఎవరూ కూడా ప్రస్తుత నీట్ పరీక్ష రాయడం లేదని ముందస్తుగా ధృవీకరణ పత్రాలు తీసుకున్నారు. గతంలో కొంతమంది వైద్య విద్యార్థుల ప్రమేయం బయటపడటంతో, నేషనల్ మెడికల్ కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో మెడికల్ కాలేజీ విద్యార్థులకు ఎలాంటి లీవులు మంజూరు చేయలేదు. పరీక్షా కేంద్రంలోకి విద్యార్థి అడుగుపెట్టే సమయం నుండి బయటకు వచ్చే వరకు తనిఖీలను పకడ్బందీగా మార్చారు. నకిలీ అభ్యర్థులు పరీక్ష రాయకుండా నిరోధించడానికి ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ వెరిఫై చేస్తారు. ఒకవేళ సాంకేతిక కారణాల వల్ల వేలిముద్రలు పడకపోతే, విద్యార్థి సమయం వృథా కాకుండా ప్రత్యేక అండర్‌టేకింగ్ ఫామ్ ద్వారా లోపలికి అనుమతిస్తారు.

**లైవ్ సీసీటీవీ నిఘా...**

దేశంలోని ప్రతీ పరీక్షా గదిని ఢిల్లీలోని ఎన్‌టీఏ సెంట్రల్ కంట్రోల్ రూమ్‌కు లైవ్ స్ట్రీమింగ్ ద్వారా అనుసంధానించారు. అడ్మినిస్ట్రేటివ్ పేపర్‌వర్క్, బయోమెట్రిక్ తనిఖీల వల్ల విద్యార్థులకు సమయం తగ్గకూడదనే ఉద్దేశంతో ఈసారి పరీక్షా సమయాన్ని 15 నిమిషాలు పెంచి, మొత్తం 195 నిమిషాలు (3 గంటల 15 నిమిషాలు) కేటాయించారు. పరీక్ష కేంద్రానికి వెళ్లే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఎన్‌టీఏ ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది.

# విద్య, సంక్షేమం, ఉపాధితో బీసీల సాధికారత

**హైదరాబాద్, జూన్ 20 సిరిన్యూస్:**




వెనుకబడిన తరగతుల విద్య, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని జిల్లా బీసీ అభివృద్ధి అధికారులు, సహాయ బీసీ అభివృద్ధి అధికారులు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్లు, శాఖాధికారులతో ప్రజా భవన్‌లో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, సంక్షేమ కార్యక్రమాల ద్వారా బీసీ యువతను సాధికారత కలిగిన వర్గంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 202526 విద్యా సంవత్సరంలో బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు 96.05 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర సగటు ఉత్తీర్ణత శాతం 95.15 కంటే అధికమని పేర్కొన్నారు. పరీక్షలకు 4,941 మంది హాజరుకాగా 4,746 మంది ఉత్తీర్ణులయ్యారని, 285 హాస్టళ్లు 100 శాతం ఫలితాలు సాధించాయని వెల్లడించారు. 641మంది 500కు పైగా మార్కులు సాధించారని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో బీసీ హాస్టళ్లలో 51.63 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, హనుమకొండ జిల్లాలు మెరుగైన ఫలితాలు సాధించాయని తెలిపారు. రెండో సంవత్సరం 71.85 శాతం ఉత్తీర్ణత నమోదైందని, హనుమకొండ, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు జిల్లాలు ఉత్తమ ఫలితాలు సాధించాయని వెల్లడించారు. ఈ సంవత్సరం మంచి మార్కులు సాధించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తక్కువ మార్కులు వచ్చిన ప్రదేశాల అధికారులను ఆదేశించారు. అదనపు విద్యా సహాయం అవసరమైన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో హాస్టల్ విద్యార్థులకు యూనిఫాం క్లాత్, నోట్‌బుక్స్ వంటి సామగ్రితో కూడిన సమగ్ర వెల్కమ్ కిట్ అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. హాస్టళ్లలో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలని, రిజర్వేషన్ ప్రకారం అడ్మిషన్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ నెలాఖరులోపు అన్ని హాస్టళ్లలో పేరెంట్‌టీచర్ సమావేశాలు నిర్వహించి విద్యార్థుల పురోగతి, హాస్టల్ సౌకర్యాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. హాస్టల్ ప్రాంగణాల పరిశుభ్రత, కలుపు తొలగింపు, నిల్వ నీటి నిర్మూలన, ఎలుకల బొరియల తొలగింపు, పెస్ట్ కంట్రోల్, ఫాగింగ్, వాటర్ ట్యాంకుల శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. డైట్ మెనూను కచ్చితంగా అమలు చేయడంతోపాటు నాణ్యమైన బియ్యం, పప్పులు, కూరగాయలు, గుడ్లు, పాలు సరఫరా చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థికి అకడమిక్ ప్రొఫైల్, ఆరోగ్య ప్రొఫైల్ రూపొందించి వారి విద్యా పురోగతి, ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. పరీక్షల ఒత్తిడి, వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం పెంపు కోసం కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సీడ్ పథకం ద్వారా డీఎన్‌టీ, ఎన్‌టీ, ఎసఎన్‌టీ వర్గాల అభివృద్ధికి అందుతున్న ప్రయోజనాలపై అర్హులైన లబ్ధిదారులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. 33 జిల్లా వెనుకబడిన తరగతుల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారితో జిల్లా బీసీ అభివృద్ధి అధికారులు సమావేశాన్ని ఏర్పాటు చేసి బీసీ సంక్షేమ శాఖ పథకాలు సంక్షేమ కార్యక్రమాలపై చర్చించాలన్నారు. బీసీ, ఈబీసీ వర్గాలకు సంబంధించిన కళ్యాణలక్ష్మి పథకం దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దని మంత్రి అధికారులను ఆదేశించారు. బీసీ స్టడీ సర్కిల్‌లో మరిన్ని సంస్కరణలు తేవాలని సూచించారు. 12 యూట్యూబ్ ఛానల్స్ ద్వారా నిరంతరం పోటీ పరీక్షలకు గైడ్‌లైన్స్ అడుగుతున్నామని, స్టడీ సర్కిల్ ఇయర్ బుక్ విడుదల చేశామని తెలిపారు. అనుభవం ఉన్న ఫాకల్టీ ద్వారా శిక్షణ ఇస్తున్నామన్నారు. త్వరలో సిద్దిపేటలో సొంత స్టడీ సర్కిల్ భవనం ప్రారంభం కానుందని తెలిపారు. సొంత భవనాల నిర్మాణం పూర్తి చేసి అందులో విషయ పరిజ్ఞానం ఉన్న చిత్రాలు, చార్టులు, మ్యాపులు రూపొందించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 12 బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా య□పీఎస్సీ, గ్రూప్స్, ఎస్సెస్సీ, బ్యాంకింగ్, ఆరఆర్‌బీ తదితర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. బోనాల పండుగ సందర్భంగా జూలై 14 నుండి 24 మధ్య హెచఎండీయే గ్రౌండ్స్‌లో కుల వృత్తుల ప్రదర్శన, మట్టి కుండల స్టాల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి.హన్మంతరావు, శాఖ కమిషనర్ బాలమాయాదేవి, అధికారులు మల్లయ్యభట్టు, అలోక్ కుమార్, మామిడి హరికృష్ణ, జిల్లా బీసీ అభివృద్ధి, సహాయ బీసీ అభివృద్ధి అధికారులు, స్టడీ సర్కిల్ డైరెక్టర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ప్రియుడి కోసం కన్నకొడుకును
# చంపిన కసాయి తల్లి


**మొదటిపేజీ తరువాయి**

కన్నకొడుకును తల్లి దారుణంగా హత్య చేసిన సంఘటన తీవ్ర కలకలం రేపుతోంది. రెండేళ్ల చిన్నారిని హత్య చేసి, ఫిట్స్‌తో చనిపోయాడంటూ కుటుంబ సభ్యులను నమ్మించి అంత్యక్రియలు కూడా నిర్వహించిన విషయం 20 రోజుల తర్వాత బయటపడింది.
పోలీసుల వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా కీసరలో నివాసముంటున్న జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన స్వామి, జ్యోతి దంపతులకు నాలుగేళ్ల కుమార్తె, రెండేళ్ల కుమారుడు హరికృష్ణ ఉన్నారు. స్వామి క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జ్యోతికి పెళ్లికి ముందే యాదాద్రి భువనగిరి జిల్లా మాదాపూర్ గ్రామానికి చెందిన నవీన్‌తో పరిచయం ఉండగా, అది వివాహేతర సంబంధంగా కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.
గత నెల 29న స్వామి విధులకు వెళ్లిన సమయంలో నవీన్ జ్యోతి ఇంటికి వచ్చాడు. ఇద్దరూ ఇంట్లో ఉండగా చిన్నారి హరికృష్ణ ఏడవడం ప్రారంభించాడు. దీంతో చిరాకుపడిన నవీన్ బాలుడిని చంపేద్దామని చెప్పగా, జ్యోతి కూడా అంగీకరించినట్లు విచారణలో తేలింది. అనంతరం ఇద్దరూ కలిసి చిన్నారిని నేలకేసి కొట్టడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. ఘటన అనంతరం భర్త ఇంటికి రాగానే బాలుడికి ఫిట్స్ వచ్చి చనిపోయాడంటూ జ్యోతి నమ్మించింది. ఆమె చెప్పిన మాటలను నమ్మిన కుటుంబ సభ్యులు చిన్నారి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. అయితే ఘటన తర్వాత జ్యోతి ప్రవర్తనపై భర్తకు అనుమానం రావడంతో కుటుంబ సభ్యుల సమక్షంలో ఆమెను ప్రశ్నించాడు. ఒత్తిడిని తట్టుకోలేక ప్రియుడితో కలిసి చిన్నారిని హత్య చేసినట్లు జ్యోతి ఒప్పుకుంది. దీంతో స్వామి కీసర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు బాలుడి మృతదేహాన్ని ఖననం చేసిన ప్రదేశం నుంచి వెలికితీసి రీపోస్టుమార్టం నిర్వహించారు. నిందితురాలు జ్యోతిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న నవీన్ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

## గాజు ఛాంబర్ల స్లీపర్ బస్సులపై
# రవాణా శాఖ ఉక్కుపాదం..

**మొదటిపేజీ తరువాయి**

నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన గాజు ఛాంబర్లపై (క్యాబిన్లు) తెలంగాణ రవాణా శాఖ ఉక్కుపాదం మోపింది. గత రెండు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ముమ్మర తనిఖీలలో, ప్రమాదకరమైన గాజు ఛాంబర్లతో నడుస్తున్న మూడు ప్రైవేట్ స్లీపర్ బస్సులను అధికారులు సీజ్ చేశారు. ఈ బస్సులన్నీ అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ కావడం గమనార్హం. ఈ వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పర్మిట్లను రద్దు చేయాలని కోరుతూ రవాణా శాఖ అధికారులు అరుణాచల్ ప్రదేశ్ అధికారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. దేశవ్యాప్తంగా జరిగిన పలు స్లీపర్ బస్సుల అగ్నిప్రమాదాల నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్, రహదారి రవాణా పరిశోధనా సంస్థలు ఈ గాజు క్యాబిన్లపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులు వేగంగా బయటకు రావడానికి, రక్షణ సిబ్బంది లోపలికి వెళ్లడానికి ఇవి పెద్ద అడ్డంకిగా మారుతున్నాయని స్పష్టం చేశాయి. అధికారిక బస్ బాడీ కోడ్ నిబంధనల ప్రకారం అత్యవసర నిష్క్రమణ మార్గాలకు, ప్రయాణికుల రాకపోకల దారికి అడ్డుగా ఎలాంటి అనధికారిక మార్పులు చేయకూడదు. గాజు ఛాంబర్ల వల్ల ప్రమాద సమయాల్లో పొగ వేగంగా వ్యాపించి ఊపిరాడకుండా చేసే ముప్పు ఉందని అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతాయని రవాణా శాఖ స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘించి బస్సులు నడిపితే తక్షణమే సీజ్ చేస్తామని, ప్రయాణీకులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన పూర్తి బాధ్యత ఆ యా ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలదేనని హెచ్చరించింది. ఇలాంటి ప్రమాదకర గాజు ఛాంబర్ల బస్సుల్లో ప్రయాణించవద్దని, సమాచారం ఉంటే రవాణా శాఖకు తెలపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రయాణికుల ప్రాణ భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని అధికారులు తేల్చిచెప్పారు.




# పేదల జీవన ప్రమాణాలు పెంచిన ప్రధాని పథకాలు

- **పుష్కరకాలంలో మహిళా సాధికారతలో పురోగతి**
- **81కోట్ల లబ్ధిదారులకు ఉచితంగా ఆహార ధాన్యాల పంపిణీ**
- **ఉజ్వల పథకం ద్వారా 11కోట్ల మహిళలకు లబ్ది**
- **సంక్షేమ పథకాల ద్వారా 25కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి**
- **రాజ్యసభ సభ్యులుడా లక్ష్మణ్**

**హైదరాబాద్, జూన్ 20 సిరిన్యూస్:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో పన్నెండు సంవత్సరాలుగా దేశం సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, మహిళా సాధికారతలో చరిత్రాత్మక పురోగతిని సాధించిందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. కవాడిగూడలో పత్రికా సమాచార కార్యాలయం(పీఐబీ) శనివారం నిర్వహించిన 'వార్త' మీడియా ఇంటరాక్షన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీఎం స్వనిధి, పీఎం ముద్రా యోజన, ప్రధానమంత్రి ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జనధన్ యోజన వంటి పథకాలు దేశంలోని పేదలు, మహిళలు, సామాజికంగా వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలను గణనీయంగా మెరుగుపరిచాయన్నారు. ఉజ్వల పథకం ద్వారా 11 కోట్లకు పైగా మహిళలు ప్రయోజనం పొందారని, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా కోట్లాది కుటుంబాలకు మరుగుదొడ్లు అందుబాటులోకి రావడంతో మహిళల ఆత్మగౌరవం, భద్రత మరింత పెరిగిందని తెలిపారు. 81 కోట్ల మందికి పైగా లబ్ధిదారులకు ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఆరోగ్య భద్రత కల్పించడం వంటి కార్యక్రమాలు ప్రపంచంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమాలని పేర్కొన్నారు. జన్ ధన్-ఆధార్-మొబైల్ (జామ్) త్రివేణి ఆధారంగా సాంకేతికతను వినియోగించి ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం ద్వారా మధ్యవర్తుల ప్రమేయాన్ని తొలగించి, పారదర్శకతను పెంపొందించారని తెలిపారు. లక్ష్యబద్ధమైన సంక్షేమ కార్యక్రమాల ఫలితంగా గత దశాబ్దంలో సుమారు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్రంలో అనేక దశాబ్దాల కాలంలో సుమారు 5 వేల కి.మీ జాతీయ రహదారులు అభివృద్ధి కాగా, గత 12 ఏళ్లలోనే మరో 5 వేల కి.మీను రూ.1.20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడితో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రైల్వే రంగంలో కేంద్రం విశేష ప్రాధాన్యం కల్పించిందని, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణం, చర్లపల్లి టెర్మినల్ నిర్మాణం, కాజీపేటలో రైల్వే తయారీ యూనిట్ ఏర్పాటు, మెదక్, సిద్దిపేట, కొమురవెల్లి ప్రాంతాలకు రైల్వే అనుసంధాన విస్తరణ వంటి కీలక ప్రాజెక్టులను ఆయన ప్రస్తావించారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, హైదరాబాద్‌ను బెంగళూరు, చెన్నై, పుణే నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైలు కారిడార్లను తాజాగా బడ్జెట్‌లో ప్రకటించారని గుర్తు చేశారు. మామునూర్, ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధితోపాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే అనేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్రం సహకరిస్తోందని పేర్కొన్నారు.

# వైద్య ఆరోగ్యశాఖలో అ'సాధారణ' బదిలీలు!

**మొదటిపేజీ తరువాయి**

బలంగా వినిపిస్తున్నాయి. సాధారణంగా బదిలీల నిబంధనలు అన్ని శాఖలకూ ఒకేలా ఉండాలి కానీ, ఇక్కడ మాత్రం కొత్త నిబంధనలు తెరపైకి తెచ్చి మరీ అక్రమాలకు తెరలేపారనే విమర్శలు వస్తున్నాయి. బదిలీ ఉత్తర్వులు వెలువడిన తర్వాత కూడా కొందరు అధికారుల బదిలీ స్థానాలను మరోసారి మార్చడం ఇక్కడి అక్రమాలకు అద్దం పడుతోంది.

**మూడు విభాగాలు.. మూడు రకాల రూల్స్**

వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ప్రధాన విభాగాలైన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్, వైద్య విధాన పరిషత్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ లలో ఒకే మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తున్నప్పటికీ ఒక్కో విభాగంలో ఒక్కో రకమైన నిబంధనలతో బదిలీలు చేపట్టారు. అన్ని విభాగాలకు కలిపి 7 వేల పైచిలుకు ఉద్యోగులు ఉండగా, అందులో 4 ఏళ్ళ సీనియారిటీ దాటిన వారు 3000 వేల మంది ఉద్యోగులు కాగా 40 శాతం కు మించకుండా బదిలీలు చేయాలన్నది నిబంధన. ఐతే ఈ మూడు విభాగాలకు సంబంధించి ప్రభుత్వం ద్వారా ప్రత్యేక అనుమతి తెచ్చి మరి సిబ్బంది, డాక్టర్లకు ఈ నెల 6వ తేదీన బదిలీ ఉత్తర్వులు జారీ చేసారు.ఇందులో నాలుగు ఏళ్ల సీనియారిటీ నిండిన వారికి బదిలీలు చేయాల్సి ఉండగా, మారిన ఒక నిబంధన మూలంగా కేవలం ఆరు నెలల సీనియారిటీ ఉన్నవారిని కూడా బదిలీ చేయడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. అర్హులైన సీనియారిటీ ఉన్నవారిని పక్కనబెట్టి ఏడాది కూడా సీనియారిటీ లేనివారికి లబ్ధి చేకూర్చడంపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**భార్యాభర్తల బదిలీల్లో కొత్త విధానం**

ఉద్యోగులైన భార్యాభర్తలకు (స్పౌజ్) ఇచ్చే బదిలీల సందర్భంగా ఈ ఏడాది సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టి సాధారణ ఉద్యోగులకు తీవ్ర నష్టం చేకూర్చారు. గతంలో భార్యాభర్తల సీనియారిటీతో పాటు కొన్ని అదనపు పాయింట్లను పరిగణనలోకి తీసుకుని బదిలీలు చేసేవారు. కానీ ఈ సారి వారు పనిచేసిన కాలపరిమితిని పూర్తిగా సున్నా చేసి బదిలీలు చేయడంతో ఎంతో కాలంగా ఒకే చోట తిష్టవేసిన వారికి లాభం చేకూరి, సాధారణ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగింది. ఈ కొత్త విధానం వెనుక దాగిన అసలు కోణం ఎవరికీ అర్థం కావడం లేదు.

**బదిలీల కోసం వేచి చూస్తున్న ఉద్యోగులు !**

వైద్య ఆరోగ్య శాఖలో సవరణలు, ప్రత్యేక అనుమతులతో కూడిన బదిలీలు పూర్తయ్యాక కూడా మరో సారి 3 ఏళ్ళు నిండిన వారికి అవకాశం కల్పిస్తూ ఆ శాఖ తీసుకొమ్మ నిర్ణయం మూలంగా 3 వందల పై చిలుకు ఉద్యోగులు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఐతే వెబ్ ఆప్షన్ లో అందుకు సంబంధించి ఇప్పటికి సమాచారం లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. అడిగింది అధికారులే దరఖాస్తు చేసుకున్నాక ఇప్పుడు ఎలాంటి నిర్ణయం వెలువడకపోవడం పట్ల ఆ శాఖ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**నిబంధనల ఉల్లంఘనపై విచారణకు డిమాండ్**

ప్రభుత్వం జారీ చేసిన జీవో 38 నిబంధనలకు విరుద్ధంగా, బదిలీలపై అధికారికంగా నిషేధం విధించిన తర్వాత కూడా వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల పర్వం కొనసాగుతుండటం విశేషం. ప్రస్తుతం మూడు ఏళ్ల కాలపరిమితి ఉన్న వారికి బదిలీలు చేస్తామంటూ మళ్లీ కొత్తగా దరఖాస్తులు స్వీకరించడం చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 12వ తేదీ లోపు బదిలీలు పూర్తి అవుతాయని ప్రచారం జరగడంతో కావాల్సిన స్థానాల కోసం పెద్ద ఎత్తున పైరవీలు నడిచాయి. ఇప్పటివరకు ఆ ఉత్తర్వులు వెలువడకపోయినప్పటికీ, నిబంధనలను సవరించి మరీ దరఖాస్తులు తీసుకోవడంపై ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. ఒక్క వైద్య ఆరోగ్యశాఖకే ఈ ప్రత్యేక వెసులుబాటు ఎందుకు ఇస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని, ఈ మొత్తం అసాధారణ బదిలీల తంతుపై ఉన్నత స్థాయి విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# వయస్సు దాచిపెట్టి పెళ్లి.. భార్యకు విడాకులు

- **మ్యాట్రిమోనియల్ పోర్టల్‌లో తప్పుడు వివరాలు ఇచ్చిన భర్త**
- **9 ఏళ్లు చిన్నవాడినంటూ మోసపూరిత సమాచారం**
- **భార్య అప్పీల్‌ను అనుమతించిన హైకోర్టు**
- **భరణం కోసం ప్రత్యేకంగా కోర్టును ఆశ్రయించవచ్చని సూచన**

**హైదరాబాద్, జూన్ 20 సిరిన్యూస్:**

వివాహానికి ముందు తన అసలు వయస్సును దాచిపెట్టి తప్పుడు సమాచారం ఇచ్చి పెళ్లి చేసుకున్న భర్త వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మ్యాట్రిమోనియల్ పోర్టల్‌లో తన వయస్సును 9 ఏళ్లు తగ్గించి చూపిన భర్తపై భార్య చేసిన అప్పీల్‌ను అనుమతిస్తూ వివాహాన్ని రద్దు చేసి విడాకులు మంజూరు చేసింది. కోర్టు వివరాల ప్రకారం, 2018 ఆగస్టులో ఈ దంపతుల వివాహం జరిగింది. పెళ్లికి ముందు భర్త తన పుట్టిన తేదీని 1981గా పేర్కొనడంతో, వయస్సు సరిపోతుందని భావించి కుటుంబ సభ్యులు వివాహానికి అంగీకరించారు. జాతకాలు కూడా అదే వివరాల ఆధారంగా పరిశీలించినట్లు తెలుస్తోంది. అయితే వివాహ రిజిస్ట్రేషన్ సమయంలో భర్త అసలు పుట్టిన తేదీ 1974 అని భార్యకు తెలిసింది. తనకంటే 9 ఏళ్లు పెద్దవాడైన వ్యక్తి తప్పుడు వివరాలతో మోసం చేశాడని భావించిన ఆమె ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. అక్కడ పిటిషన్ తిరస్కరణకు గురికావడంతో హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. విచారణ సందర్భంగా ఇరువురు కలిసి జీవించేందుకు ఆసక్తి లేదని కోర్టుకు తెలిపారు. తగిన సెటిల్మెంట్, తన బంగారు ఆభరణాలు తిరిగి అందిస్తే భర్తపై పెట్టిన గృహహింస, క్రిమినల్ కేసులను ఉపసంహరించుకుంటానని భార్య పేర్కొంది. మరోవైపు, తన బంగారం కూడా ఆమె వద్దే ఉందని, దానిని వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నానని భర్త కోర్టుకు తెలిపాడు. ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన హైకోర్టు భార్య అప్పీల్‌ను అనుమతిస్తూ వివాహాన్ని రద్దు చేసింది. అయితే హిందూ వివాహ చట్టంలోని సెక్షన్25 కింద ప్రత్యేక దరఖాస్తు చేయనందున ప్రస్తుతం శాశ్వత భరణం మంజూరు చేయలేమని స్పష్టం చేసింది. భరణం, బంగారు ఆభరణాల రికవరీ కోసం సంబంధిత ఫ్యామిలీ కోర్టు లేదా ఇతర చట్టబద్ధ వేదికలను ఆశ్రయించే స్వేచ్ఛ భార్యకు ఉందని హైకోర్టు పేర్కొంది. భర్తపై నమోదైన గృహహింస, క్రిమినల్ కేసులు మాత్రం యథావిధిగా కొనసాగనున్నాయి.

## ప్రభుత్వ ధాన్యానికి టోకరా..
# నకిలీ రికార్డులతో రూ.91 లక్షలు లూటీ..!

- **గోదాం మేనేజర్, సూపర్‌వైజర్ సహా ఆరుగురు అరెస్ట్**
- **రూ.14 లక్షల నగదు స్వాధీనం.. రూ.46 లక్షల ఖాతాలు ఫ్రీజ్**
- **రైస్ మిల్లుల పాత్రపై లోతైన దర్యాప్తు**

**సిరిసిల్ల, జూన్ 20 సిరిన్యూస్:**



ప్రభుత్వ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నకిలీ రికార్డులు సృష్టించి రూ.91 లక్షల ప్రభుత్వ నిధులను కాజేసిన అంతర్ జిల్లా ముఠా గుట్టును రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ వ్యవహారంలో గోదాం మేనేజర్, సూపర్‌వైజర్ సహా ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే వెల్లడించారు. పోలీసుల దర్యాప్తులో నిందితులు నకిలీ ట్రక్ షీట్లను తయారు చేసి వాటిని సివిల్ సప్లైస్ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్లు తేలింది. ఈ తప్పుడు రికార్డుల ఆధారంగా ప్రభుత్వానికి చెందిన సుమారు రూ.91 లక్షల నిధులను అక్రమంగా పొందినట్లు గుర్తించారు. కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములకు ధాన్యం తరలించినట్లు పత్రాల్లో నమోదు చేసినప్పటికీ, వాస్తవానికి ఆ ధాన్యాన్ని ప్రైవేట్ రైస్ మిల్లులకు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు విచారణలో బయటపడింది.

## వీవోఏల సంక్షేమం కోసం కృషి చేస్తున్నాం

- **మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**

**హైదరాబాద్,జూన్ 19 సిరిన్యూస్ :**

మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతం, గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతలో కీలక పాత్ర పోషిస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్ (వీవోఏ) సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. ఖైరతాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో వీవోఏలతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించిన మంత్రి సీతక్క వారికి అందుతున్న సదుపాయాలు, విధి నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లు, భవిష్యత్ అవసరాలపై స్వయంగా అభిప్రాయాలు తెలుసుకున్నారు. వారి సంక్షేమం, సేవా భద్రత, ఆర్థిక స్థిరత్వం కోసం ప్రభుత్వం పలు కీలక చర్యలు చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. మహిళా సంఘాల సమాఖ్యలు (వీవోలు) గ్రామీణ మహిళల ఆర్థిక అభివృద్ధికి వెన్నెముకలుగా నిలుస్తున్నాయని, ఆ సమాఖ్యలను సమర్థవంతంగా నడిపించడంలో వీవోఏలు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. వారి కృషిని గుర్తించి దేశంలోనే ప్రత్యేకంగా గౌరవ వేతనం అందిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. జీవో 58 ప్రకారం రాష్ట్రంలోని 17,609 గ్రామ సంస్థలకు అనుబంధంగా పనిచేస్తున్న వీవోఏలకు నెలకు రూ.5,000 చొప్పున గౌరవ వేతనం అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు వీవోఏల గౌరవ వేతనాల కోసం రూ.661.92 కోట్లకుపైగా ప్రభుత్వం విడుదల చేసిందని వెల్లడించారు. మహిళా సంఘాల సమాఖ్యల ఆర్థిక స్వావలంబనను పెంచేందుకు ప్రభుత్వం అనేక ఆదాయ వనరులను కల్పిస్తోందని మంత్రి తెలిపారు. బ్యాంకు లింకేజ్ రుణాలపై 0.3 శాతం కమీషన్‌ను గ్రామ సంస్థలకు అందిస్తున్నామని, దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా యేటా రూ.50 నుంచి రూ.52 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోందని చెప్పారు. ఒక్కో గ్రామ సంస్థకు సగటున రూ.28,500కు పైగా ఆదాయం లభిస్తోందన్నారు.

# మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

- **ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీలో మంత్రి అజారుద్దీన్**

**హైదరాబాద్, జూన్ 20 సిరిన్యూస్:**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం మహిళల సాధికారత, సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ తెలిపారు. మహిళల ఆర్థిక, విద్య, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హైదరాబాద్ బంజారా భవన్‌లో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ వెంకట బాల్మూరి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మహిళల సంక్షేమం, సాధికారత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సభకు విచ్చేసిన ప్రముఖులు అభినందించారు.

# సాగునీటి సమస్య పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

సమీపంలో నిర్మాణంలో ఉన్న రాజీవ్ గాంధీ ఎత్తిపోతల పథకం పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.394 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ పథకం పూర్తయిన తర్వాత ముక్త్యేశ్వరాపురం మేజర్, గణపురం మేజర్ ఆయకట్టుల పరిధిలోని 14100 ఎకరాలకు కృష్ణా జలాలు అందనున్నాయని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం 35 ఎకరాల రైతుల భూములను కొనుగోలు చేసి వారికి రూ. 17.50 కోట్లు నష్టపరిహారం చెల్లించినట్లు తెలిపారు. కృష్ణా నది పక్కనే ఉన్నా సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఈ పథకాన్ని రూపొందించామని చెప్పారు. ఈ పథకం ద్వారా మేళ్లచెరువు మండలం కందిబండలో 2,494 ఎకరాలకు, రామాపురంలో 3,826 ఎకరాలకు, చింతలపాలెం మండలం హుజూర్నగర్ ప్రాంతంలో 149 ఎకరాలకు, దొండపాడులో 1,589 ఎకరాలకు, కోదాడ మండలం గణపవరంలో 2,437 ఎకరాలకు, కూచిపూడిలో 1,060 ఎకరాలకు, ఎర్రవరం, రామలక్ష్మీపురం, బిక్య తండా గ్రామాలకు 1,634 ఎకరాలకు, తొగర్రాయిలో 831 ఎకరాలకు, చిలుకూరు మండలంలో 80 ఎకరాలకు సాగునీరు అందుతుందని మంత్రి వెల్లడించారు. పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మొత్తం 22 కి.మీ ప్రెషర్ మెయిన్ పైప్‌లైన్‌లో ఇప్పటికే 16 కి.మీ మేర పైపుల తయారీ పూర్తికాగా, 6 కి.మీ మేర పైపుల ఏర్పాటు పూర్తి అయిందని తెలిపారు. మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టు సంస్థలను ఆదేశించినట్లు చెప్పారు. సాగునీటి పంపిణీలో ఎలాంటి అసమానతలు లేకుండా ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాల్వల చివరి ప్రాంతాల్లోని రైతులు కూడా లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పథకంతో సాగునీటితో పాటు చెరువులు నిండుతాయని, తద్వారా



భూగర్భ జల మట్టం పెరిగి గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, వ్యవసాయ అవసరాలకు దీర్ఘకాలిక భద్రత లభిస్తుందని పేర్కొన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఈ ప్రాంతానికి ప్రధాన జీవనాడిగా ఉన్నప్పటికీ రాజీవ్ గాంధీ ఎత్తిపోతల పథకం వంటి అనుబంధ ప్రాజెక్టులు నీటి పంపిణీలో ఉన్న లోటుపాట్లను అధిగమించి రైతులకు మరింత భరోసా కల్పిస్తాయని మంత్రి తెలిపారు. సాగునీటి రంగానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఎకరాకు నీరు అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కే.నరసింహ, ఇరిగేషన్ ఎస్ఈ నాగభూషణం, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య, వంగవీటి రామారావు, సర్పంచ్‌లు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## శివ క్షేత్రంలో మంత్రి పూజలు

**కుటుంబంతో కలిసి దైవ దర్శనం**
**పూర్ణకుంభంతో ప్రత్యేక ఆహ్వానం**
**మంత్రి తో కాట శ్రీనివాస్ గౌడ్**



**అమీన్పూర్ జూన్ 20 సిరి న్యూస్**

అమీన్పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని బీరంగూడ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయాన్ని శనివారం మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక అర్చనలు, హారతులు నిర్వహించి, ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పటాన్చెరు నియోజకవర్గ ఇన్చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి ఆలయ అభివృద్ధి అంశాలపై స్థానిక నాయకులతో చర్చించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులు మంత్రిని ఘనంగా ఆహ్వానించారు. దేవాలయ ప్రాంగణంలో భక్తులతో మంత్రి ఆత్మీయంగా ముచ్చటించారు. కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి కుమారుడు వంశీకృష్ణ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుధారాణి,ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలయ ట్రస్ట్ సభ్యులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**అక్కన్నపేట గ్రామ**
**సర్పంచ్ బక్కయ్య యాదగిరి**

**రామాయంపేట, జూన్ 20 (సిరి న్యూస్)**



ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో ఉన్న జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం నాడు ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా పాఠశాల మూసి ఉంటుందని, అందువల్ల ఒకరోజు ముందు శనివారం రోజు ఆ గ్రామ సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి విద్యార్థులతో కలిసి యోగ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి విద్యార్థులతో కలిసి యోగా ఆసనాలు వేసి యోగా ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ యాదగిరి మాట్లాడుతూ, యోగా చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని తెలిపారు. నిత్యం యోగా సాధన చేయడం ద్వారా ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరిగి, ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని యోగా సాధన చేశారు.

## కబ్జా కోరల్లో క్రీడా ప్రాంగణం

**ఆట స్థలం పై అక్రమణల నీడ**
**యువత భవిష్యత్తుతో ఆటలు**
**కబ్జా దారులపై చర్యలు తీసుకోండి**
**తాసిల్దార్ కు బిజెపి డిమాండ్**

**జిన్నారం జూన్ 20 సిరి న్యూస్**



బొల్లారం డివిజన్ పరిధిలోని బీరప్ప బస్తి లోని సర్వే నంబర్ 284లో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం గతంలో ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ క్రీడా ప్రాంగణం కబ్జాలకు గురవుతుంది అక్రమణాల పర్వం స్థానిక యువత పిల్లలు ఆడుకునే క్రీడా ప్రాంగణాన్ని కొందరు స్థానిక కబ్జాదారులు అక్రమంగా అక్రమిస్తున్నారు.ఆందోళన బాట విలువైన ప్రభుత్వ భూమిని క్రీడా ప్రాంగణాన్ని కాపాడాలనీ అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చేయాలని స్థానికులు క్రీడాకారులు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కబ్జాపై స్థానికులు, జిహెచ్ఎంసి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని బిజెపి శ్రేణులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా స్పందించండి క్రీడా ప్రాంగణం పూర్తిగా కబ్జాకు కాకముందే తాసిల్దార్ ప్రత్యేక దృష్టి సారించి ఈ విలువైన ప్రభుత్వ భూమిని అక్రమంగా దారుల నుండి కాపాడాలని బిజెపి శ్రేణులు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, శ్రీకాంత్ చారి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుపోటు.

- **ధాన్యం కొనుగోలుకు కొర్రీలు సహించం.**
- **కేంద్రం కోటాతోనే పరిమితం చేయడం రైతు వ్యతిరేక నిర్ణయం.**
- **కేంద్రంపై ఒత్తిడి తేవడంలో ప్రభుత్వం విఫలం.**
- **రైతుల పక్షాన బిఆర్ఎస్ మరో ఉద్యమానికి సిద్ధం..**
- **బీఆర్ఎస్ హయాంలో రైతు సంక్షేమం ఒక స్వర్ణ యుగం.**
- **రైతుబంధు, రైతుబీమాతో రైతుకు భరోసా కల్పించాం..**
- **మాజి డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి.**




**మెదక్,జూన్, 20(సిరి న్యూస్)**

తెలంగాణ రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి విమర్శించారు.శనివారం మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే పంటలు కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం 70 లక్షల మంది రైతులకు తీవ్ర అన్యాయం చేయడమేనని అన్నారు.బిఆర్ఎస్ హయాంలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేయగా, ప్రస్తుతం రైతులను సంక్షోభంలోకి నెట్టే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. రైతులు పండించిన ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

**మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్**

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతే కేంద్రబిందువుగా పాలన సాగిందని, రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాలతో తెలంగాణ వ్యవసాయ రంగం దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.రైతుల ఖాతాల్లో నేరుగా లక్ష కోట్లకు పైగా జమ చేసి, రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఎన్నికల సమయంలో అన్ని పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు చేతులెత్తేయడం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. పంటల కొనుగోళ్ల విషయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను దళారుల దయాదాక్షిణ్యాలకు వదిలేస్తోందని ఆరోపించారు.గతంలో కేంద్రం కొనుగోలు చేయని పంటలను కూడా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు.ఇప్పుడు కేంద్రం కోటా మేరకే కొనుగోలు చేస్తామనడం అత్యంత బాధాకరమని అన్నారు. రైతుల ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవడం సరికాదని చెప్పారు.తెలంగాణ రైతులు పండించే ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.ఈ మీడియా సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు యం. లావణ్య రెడ్డి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లు బట్టి జగపతి,అకిరెడ్డి.కృష్ణారెడ్డి,పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు,మెదక్ మండల పార్టీ అధ్యక్షులు యం.అంజ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు బట్టి ఉదయ్ కుమార్,జుబెర్ అహ్మద్, నాయకులు కృష్ణ గౌడ్,లింగారెడ్డి, కిష్టయ్య,భీమరి కిషోర్,పట్లోరి. రాజు,మోహన్ నాయక్,సాయి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.




# ప్రభుత్వ వైఫల్యాలను రైతాంగం ఎండగట్టాలి

- **అందోలు మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్**

**జోగిపేట జూన్ 20 (సిరి న్యూస్):**



నియోజక వర్గం లోని రైతాంగం, యువత ప్రభుత్వ వైఫల్యాలను ఎండ గట్టాలని మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పిలుపునిచ్చారు. శనివారం అందోలు లక్ష్మి నర్సింహ గార్డెన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని, రైతుల సంక్షమం లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కోనుగోలు చేయకుండా చేతులు ఎత్తివేయడం సిగ్గుచేటని అందోలు మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రతి గింజ కొంటాం అని ప్రగల్బాలు పలికిన సిఎం ఆయన సహచర మంత్రులు మాట దాట వేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వంను పరిగణ లోకి తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన అన్నీ పంటలను సీలింగ్ లేకుండా కోనుగోలు చేయాలనీ ఆయన డిమాండ్ చేసారు. కేసీఆర్ హయాంలో రైతు లకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బీమా ఎత్తివేయడం జరిగిందన్నారు. రైతు బంధు డబ్బులు రైతుల అక్కౌంట్‌లో పడడంలేదని ఆందోళన చెందుతున్నారన్నారు. రైతు వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ పార్టీ నిరసిస్తున్నట్లు చెప్పారు. ◌ాజీ డిసిసిబి వైస్ చైర్మన్ పి జైపాల్ రెడి. ◌ మాజీ ఏఎంసీ చైర్మన్లు పి. నారాయణ, పల్లే సంజీవయ్య మాజీ ఎంపీపీ రామగౌడ్, చంద్రయ్య, నాయకులు లింగా గౌడ్, పైతర సాయి కుమార్, వీర రెడ్డి, చాపల వెంకటేశం, మాచర్ల విజయ్ కుమార్, శివ కుమార్, ఎ. శంకరయ్యలతోపాటు పలువురు పాల్గొన్నారు.

# ప్రతిభకు పెడల్స్‌- - - భవిష్యత్తుకు బాటలు

- **438 మంది విద్యార్థులకు సైకిళ్ల కానుక**
- **రూ.35 లక్షల సొంత నిధులతో ఎమ్మెల్యే జీఎంఆర్ ఆదర్శం**



**రామచంద్రపురం (పటాన్‌చెరు), జూన్ 20, (సిరి న్యూస్):**

పటాన్‌చెరు నియోజకవర్గ చరిత్రలోనే తొలిసారిగా పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన 438 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రూ.35 లక్షల సొంత నిధులతో కొనుగోలు చేసిన సైకిళ్లను పంపిణీ చేశారు. 2025–26 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు ఈ ప్రోత్సాహకానికి ఎంపికయ్యారు.శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని 48 ప్రభుత్వ, 89 ప్రైవేటు పాఠశాలలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి, ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రేరణ కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఈ విద్యా సంవత్సరం నుంచి సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు.పదో తరగతి విద్యార్థుల జీవితంలో ఇది కీలకమైన దశ అని, ఈ స్థాయిలో సాధించే ఫలితాలే భవిష్యత్ విద్యాభ్యాసానికి బలమైన పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని విద్యార్థులకు సూచించారు.విద్యార్థుల భవిష్యత్ కోసం తమవంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ మరిన్ని ప్రోత్సాహక కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ప్రైవేటు పాఠశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఓటరు జాబితా సవరణపై అవగాహన కార్యక్రమం...

- **ఎస్ఐఆర్ శిక్షణలో పాల్గొన్న ఆదర్శ్ రెడ్డి**

**రామచంద్రపురం , జూన్ 20, (సిరి న్యూస్):**

పటాన్‌చెరు నియోజకవర్గంలోని భారతి నగర్ డివిజన్ హెచ్ఐజీ ఫంక్షన్ హాల్‌లో బీఎల్‌వో సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు, బీఎల్ఏల కోసం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఓటరు జాబితా పరిశీలన, ధృవీకరణ ప్రక్రియపై అధికారులు అవగాహన కల్పించి, బీఎల్‌వోలు, బీఎల్ఏల సందేహాలను నివృత్తి చేశారు.ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితాలో అర్హులైన ఓటర్ల పేర్లు మాత్రమే కొనసాగించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డూప్లికేట్ ఓట్లు, మరణించిన వ్యక్తుల పేర్లు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తొలగించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రవి, సింధు ఆదర్శ్ రెడ్డి, తొంట అంజయ్య, పరమేష్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు, బీఎల్‌వోలు, బీఎల్ఏలు పాల్గొన్నారు



# మెదక్ లో ఘనంగా అయ్యప్ప స్వామి రజతోత్సవాలు..

- అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి.
- మహా పడి పూజలో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.
- అయ్యప్ప స్వామివారికి 50 తులాల వెండి సమర్పణ.

**మెదక్,జూన్,20 (సిరి న్యూస్)**

అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని మాజీ డిప్యూటీ స్పీకర్ యం.పద్మా దేవేందర్ రెడ్డి ఆకాంక్షించారు.మెదక్ పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో రజతోత్స వాలలో భాగంగా శనివారం నిర్వహించిన మహా పడి పూజ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి. సుభాష్ రెడ్డి, బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం శ్రీ మాధవ నంద స్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ..మెదక్ అయ్యప్ప స్వామి దేవాలయంలో రజతోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. దేవాలయాలు ఆధ్యాత్మిక చింతనకు కేంద్రాలుగా నిలుస్తూ సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అయ్యప్ప స్వామి మహా పడి పూజలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ రజతోత్సవాల విజయవంతానికి కృషి చేస్తున్న అయ్యప్ప భక్త సేవా సమాజం సభ్యులను,భక్తులను అభినందించారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వామివారికి 50 తులాల వెండిని సమర్పించారు. అనంతరం



ఆలయ అర్చకులు వైద్య రాజు పంతులు పద్మ దేవేందర్ రెడ్డి గారిని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు యం. లావణ్య రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు బట్టి. జగపతి,కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు, మున్సిపల్ కౌన్సిలర్ లు బట్టి ఉదయ్ కుమార్, మాయ. గంగామణి,నాయకులు లింగా రెడ్డి,మాయ మల్లేశం,కిష్టయ్య, సాయి, మోహన్ నాయక్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మంచిర్యాలలో..విద్యా వ్యాపారంపై యుద్ధం..

- విద్య పేరుతో దోపిడీ.?..
- ప్రైవేట్ స్కూళ్ల ఆగడాలపై ఫిర్యాదు..
- అధిక ఫీజులు, పుస్తకాల భారంతో తల్లిదండ్రుల వేదన..
- విద్యా వ్యాపారంపై చర్యలు కోరిన విద్యార్థి సంఘాలు..

**మంచిర్యాల, జూన్ 20 ( సిరి న్యూస్ )**

విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రుల జేబులు ఖాళీ చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ఐక్య విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.అధిక ఫీజులు, పాఠ్యపుస్తకాల దోపిడీ, యూనిఫాంలు, విద్యా సామగ్రి పేరుతో జరుగుతున్న వసూళ్ల వల్ల మధ్యతరగతి, పేద కుటుంబాలు తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశాయి. విద్యను హక్కుగా కాకుండా లాభదాయక వ్యాపారంగా మార్చిన యాజమాన్యాలపై ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ మేరకు శనివారం మంచిర్యాల మండలంలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.



అనంతరం సంఘాల నాయకులు మాట్లాడుతూ, జిల్లాలోని అనేక ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులపై అనవసర ఆర్థిక భారం మోపుతున్నాయని ఆరోపించారు.పాఠశాలల్లో ప్రవేశాల పేరుతో భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేయడంతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, బూట్లు, బ్యాగులు, ఇతర విద్యా సామగ్రిని తప్పనిసరిగా కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని పాఠశాలలు తమ ఆవరణలోనే విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసి విద్యను పూర్తిస్థాయి వ్యాపారంగా మార్చేశాయని విమర్శించారు.మరికొన్ని విద్యాసంస్థలు తాము సూచించిన దుకాణాల్లోనే పుస్తకాలు కొనుగోలు చేయాలని నిబంధనలు విధిస్తున్నాయని, అంగీకరించని తల్లిదండ్రులను వివిధ రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. పాఠ్యపుస్తకాలపై గరిష్ఠ ధరకు మించి వసూలు చేస్తూ తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ అధికారులు కేవలం హెచ్చరికలకే పరిమితం కాకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజులు, పాఠ్యపుస్తకాల ధరలు, ఇతర అక్రమ వసూళ్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాలను కాపాడే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని, విద్యను వ్యాపార వస్తువుగా మార్చే ప్రయత్నాలను అరికట్టాలని ఐక్య విద్యార్థి సంఘాలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్, జాతీయవాద విద్యార్థి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బచ్చలి అభిరామ్ తదితరులు పాల్గొన్నారు..

# ఈఎస్ఐలో మందులు, సదుపాయాల కొరత..

- మంత్రి, స్టేట్ మెడికల్ డైరెక్టర్‌కు సీఐటీయూ వినతిపత్రం

**రామచంద్రాపురం, జూన్ 20, (సిరి న్యూస్):**

రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కొరత, మందుల లభ్యత సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, ఈఎస్ఐ స్టేట్ మెడికల్ డైరెక్టర్ హరిచందనలకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు పాండురంగారెడ్డి మాట్లాడుతూ రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రిలో అత్యవసరంగా సిటీ స్కాన్, ఐసీయూ, బ్లడ్ బ్యాంక్, డిజిటల్ ఎక్స్‌రే, డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్పెషలిస్ట్ వైద్యులు సూచించిన మందులను ఈఎస్ఐ మార్గదర్శకాల ప్రకారం అందించడంతో పాటు, సూపర్ స్పెషాలిటీ మందులను గతంలో మాదిరిగానే రామచంద్రాపురం ఆసుపత్రి ద్వారానే పంపిణీ చేయాలని కోరారు.ఈఎస్ఐ కార్పొరేషన్





నుంచి వందల కోట్ల రూపాయల నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో వైద్య పరికరాలు, మందుల కొరత తీవ్రంగా ఉందని ఆరోపించారు. ప్రభుత్వం తన వాటా నిధులను పూర్తిస్థాయిలో కేటాయించి ఈఎస్ఐ వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలని కోరారు.డైరెక్టర్ జనరల్ ఆమోదించిన రేట్ కాంట్రాక్ట్ ప్రకారం కొనుగోలు చేయాల్సిన మందులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని, ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకుడు ఎం.డి. వాజిద్ అలీ, పటాన్‌చెరు ఏరియా కార్యదర్శి నాగేశ్వరరావు, ఈఎస్ఐసి మాజీ బోర్డు సభ్యుడు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# పెన్నార్ ఎన్నికల్లో బి ఆర్ టి యు హ్యాట్రిక్ విజయం..

- 46 ఓట్ల మెజారిటీతో ఘన గెలుపు
- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి నాయకత్వానికి కార్మికుల మద్దతు

**రామచంద్రపురం (పటాన్‌చెరు), జూన్ 20, (సిరి న్యూస్):**



పటాన్‌చెరు పరిధిలోని పెన్నార్ ఇండస్ట్రీస్ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బి ఆర్ టి యు అనుబంధ సంఘం వరుసగా మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేసింది. మొత్తం 465 మంది ఓటర్లలో 460 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా, బి ఆర్ టి యు కు 253 ఓట్లు, సీఐటీయూ అనుబంధ సంఘానికి 207 ఓట్లు లభించాయి. దీంతో బి ఆర్ టి యు 46 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించింది.ఫలితాల అనంతరం పరిశ్రమ గేటు వద్ద నిర్వహించిన విజయోత్సవాల్లో బి ఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ మాట్లాడుతూ వరుసగా మూడోసారి తమపై విశ్వాసం ఉంచి గెలిపించిన కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నాయకత్వంలో కార్మిక సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. కార్మికుల నమ్మకానికి అనుగుణంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ, ప్రతి కార్మికుడి అభ్యున్నతి కోసం కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు.పరిశ్రమలో కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు లక్ష్మారెడ్డి, వెంకట్రావు, రామ్మోహన్‌రావు, పెంటయ్య, జానకిరామ్, వెంకటేశ్వర్లు, బీవీ రావు, సోమేష్ తదితరులు పాల్గొనగా, కార్మికులు భారీ సంఖ్యలో హాజరై విజయోత్సవాల్లో పాల్గొన్నారు



# ఘనంగా కట్ట మైసమ్మకు బోనాలు



**వెల్దుర్తి,జూన్ 20 (సిరి న్యూస్):**

వెల్దుర్తి మండలం బస్వాపూర్ గ్రామంలో గత రెండు రోజులుగా జరుగుతున్న కట్ట మైసమ్మ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అంతేకాకుండా గ్రామంలో ఉన్న గ్రామ దేవతలకు మహిళలు ఘనంగా బోనాలు నిర్వహించరు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కట్ట మైసమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వర్షాలు సమృద్ధిగా పడి పంటలు బాగా పండాలని వారు అమ్మవారిని కోరుకుంటున్నాం అని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తలారి మల్లేష్, ఉప సర్పంచ్ మల్లేష్ గౌడ్, రాములు, శేఖర్,రమేష్ గౌడ్, సింహం,తదితరులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో యోగా, ఫాదర్స్ డే సెలబ్రేషన్స్

**విద్యార్థుల చేత ఆకట్టుకునే యోగాసనాల ప్రదర్శన**
**తండ్రి త్యాగాలను కొనియాడిన పాఠశాల డైరెక్టర్**
**ఉత్సాహంగా పాల్గొన్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు**

**శాంతినగర్, జూన్ 20 (సిరి న్యూస్):**

ప్రపంచానికి భారతదేశం అందించిన అమూల్యమైన వరాలలో యోగా అత్యంత ముఖ్యమైనదని, ఇది శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పట్టణంలోని శాంతినగర్‌లో గల సెయింట్ ఆంథోనీస్ పాఠశాల ప్రతినిధులు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం మరియు ఫాదర్స్ డే సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం పాఠశాల ప్రాంగణంలో రెండు వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ ఉమ్మడి వేడుకలు విద్యార్థులలో, తల్లిదండ్రులలో ఒక సరికొత్త స్ఫూర్తిని నింపాయి. కార్యక్రమంలో భాగంగా పాఠశాల వ్యాయామోపాధ్యాయుల ప్రత్యేక పర్యవేక్షణలో విద్యార్థులు వివిధ రకాల క్లిష్టమైన యోగాసనాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. యోగా సాధన చేయడం వల్ల శారీరక దృఢత్వం లభించడమే కాకుండా, విద్యార్థులలో మానసిక ప్రశాంతత, ఏకాగ్రత మరియు ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వివరించారు. ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో యోగాను ఒక భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ ఈ. విజయ్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవితానికి యోగా ఎంత అవసరమో, కుటుంబానికి తండ్రి అంతే ముఖ్యమని ఆవేదనతో కూడిన సందేశాన్ని ఇచ్చారు. ఫాదర్స్ డే ప్రాధాన్యతను గుర్తు చేస్తూ.. తల్లి నవమాసాలు మోసి జన్మనిస్తే, తండ్రి జీవితాంతం తన కుటుంబాన్ని తన హృదయంలో మోస్తూ అహర్నిశలు శ్రమిస్తాడని, ఆయన చేసే త్యాగాలు, ప్రేమ, బాధ్యతలు ఎప్పటికీ మరువలేనివని కొనియాడారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని పాఠశాలకు విచ్చేసిన విద్యార్థుల తండ్రుల కోసం ప్రత్యేకంగా వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించారు. తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా ఈ పోటీలలో పాల్గొని తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ మరియు ప్రిన్సిపాల్ ఈ. అరుణా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్ లక్ష్మి శెట్టి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. సెయింట్ ఆంథోనీస్ పాఠశాల అధినేత డాక్టర్ సలోమోన్ రెడ్డి దివ్యాశీస్సులు, మార్గదర్శకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# యువ సమ్మేళనం నకు భారీగా బయలుదేరిన బీజేవైఎం నాయకులు




**వెల్దుర్తి జూన్ 20, (సిరి న్యూస్ ):**

మెదక్ జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సతీష్ పటేల్ అధ్యక్షతన, కేంద్రంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం విజయవంతంగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించనున్న " యువ సమ్మేళనం" కార్యక్రమానికి వెల్దుర్తి మండలం నుండి బీజేవైఎం నాయకులు పుట్నాల విశ్వేశ్వర్ అలాగే బీజేవైఎం మండల నాయకుడు విక్రమ్ సింగ్ పురోహితు ఆధ్వర్యంలో సుమారు 30 మంది యువకులు బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరంఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు వళ్లాస్ మల్లేష్ గౌడ్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి అరవింద్ రెడ్డి హాజరయ్యారు. 12 సంవత్సరాలుగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ముఖ్యంగా యువత సాధికారతకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు.యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, స్కిల్ ఇండియా మిషన్, దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన , మై భారత్, పీఎం ఇంటర్న్‌షిప్ పథకం, నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ పీఎం-సేతు, పీఎం-దక్ష్, నేషనల్ కెరీర్ సర్వీస్,వంటి అనేక పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు కార్యక్రమ మండల ఇన్చార్జిలు యువ నాయకులు పెద్ద ఎత్తున కార్యక్రమనికి విచ్చేసి విజయవంతం చేయడం జరిగింది.



## రూ. 500 కోట్లతో చెరువు సుందరీకరణ

**కిలోమీటరున్నర పొడవునా నెక్లెస్ రోడ్ నిర్మాణం**
**త్వరలోనే శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి**
**అధికారులతో కలిసి జగ్గారెడ్డి, నిర్మల పరిశీలన**
**రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని ఆదేశం**
**సంగారెడ్డి చెరువు అభివృద్ధిపై ప్రత్యేక చొరవ**



**సంగారెడ్డి టౌన్, జూన్ 20 (సిరి న్యూస్):**

సంగారెడ్డి పట్టణంలోని కింది బజార్ చెరువును ఐదు వందల కోట్ల రూపాయల భారీ వ్యయంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి కసరత్తు వేగవంతం చేశారు. ఇందులో భాగంగా శనివారం వారు హెచ్ఎండీఏ, ఆర్థిక, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అన్ని ఆధునిక హంగులతో చెరువును ఏ విధంగా పర్యాటక కేంద్రంగా మార్చాలనే అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.

**నెక్లెస్ రోడ్, ఆధునిక పార్కులు**

ఈ ప్రాజెక్టులో భాగంగా కిలోమీటరున్నర పొడవున్న చెరువు కట్టను పూర్తిగా ఆధునీకరించి, హుస్సేన్ సాగర్ తరహాలో అద్భుతమైన నెక్లెస్ రోడ్‌తో పాటు ప్రజల వినోదం కోసం ఆధునిక పార్కులను నిర్మించనున్నారు. సంగారెడ్డి పరిసర ప్రాంత ప్రజలతో పాటు హైదరాబాద్ నుండి వచ్చే పర్యాటకులకు ఎంతో ఆహ్లాదాన్ని పంచేలా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దాలని జగ్గారెడ్డి అధికారులకు సూచించారు.

**శంకుస్థాపన చేయనున్న సీఎం**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అతి త్వరలోనే ఈ సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేయించనున్నట్లు జగ్గారెడ్డి వెల్లడించారు. ఇందుకోసం అవసరమైన అన్ని అధికారిక ప్రతిపాదనలను సిద్ధం చేసి పనుల్లో వేగం పెంచాలన్నారు. శంకుస్థాపన జరిగిన రెండేళ్ల కాలపరిమితిలోనే పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. సమీక్ష అనంతరం జగ్గారెడ్డి, నిర్మల అధికారులతో కలిసి కింది బజార్ చెరువు కట్ట, అలుగు వద్ద ఉన్న ప్రభుత్వ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

## తడి, పొడి చెత్తను వేరుచేయాలి



**నర్సాపూర్ జూన్ 20 (సిరి న్యూస్)**

పురపాలక సంఘం నందు తడి, పొడి, హానికర ప్రమాదకర చెత్త వేరు చేయు విధానంపై, ఘన పదార్థ వ్యర్థాల నిర్వహణ చట్టం 2026 ప్రకారం మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్ ఆధ్వర్యంలో శనివారం 13 వ వార్డులో ప్రజలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు విధిగా తడి పొడి హానికర , ప్రమాదకర చెత్తను నాలుగు రూపాలలో వేరుచేసి పురపాలక సంఘం స్వచ్ఛ ఆటోకి ఇవ్వడం వలన వాటిని తిరిగి రీసైక్లింగ్ చేసి ఉపయోగకర వస్తులుగా, ఎరువులుగా చేసుకోవచ్చు అన్నారు బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేయవద్దని వర్షాకాలంలో దోమలు ఎక్కువగా కాబట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అన్నారు వైస్ చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో చెత్తను వేరు చేసి, విడిగా డబ్బాల ద్వారా చెత్త స్వచ్ఛ ఆటోకు ఇచ్చి సహకరించాలని అన్నారు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా, మెదక్ – హైదరాబాద్ జాతీయ రహదారి వెంట గురుకుల పాఠశాల వరకు రోడ్డు ప్రక్కన గల ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వైట్ల మధుసూదన్ మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు, సిబ్బంది ప్రజలు పాల్గొనడం జరిగింది.

## అక్షర స్కూల్ లో యోగా వేడుకలు




**తూప్రాక్ జూన్ 20 సిరి న్యూస్**

తూప్రాన్ అక్షర స్కూల్ లో శనివారం విద్యార్థులచే యోగా వేడుకలు పాఠశాల ఆవరణలో పలు ఆసనాలతో ప్రదర్శన ఆకట్టుకుంది. ఆసనాలు వేసి యోగా విశిష్టతను తెలియజేసారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఉదయశ్రీ మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించడమే కాకుండా మనసు ప్రశాంతత ఆరోగ్యపరమైన మరెన్నో ప్రయోజనాలు ఉన్నాయని విద్యార్థులకు తెలిపారు

# చిత్తాపూర్‌లో పర్యావరణ హత్య..

## చిత్తాపూర్‌లో మామిడి చెట్ల మారణహోమం

- **వందల ఎకరాల మామిడి తోటలు మాయం..**
- **వాల్టా చట్టానికి బహిరంగ సవాల్..**
- **అధికారుల మౌనంపై ప్రజల ఆగ్రహం..**
- **రాజకీయ అండతోనే అక్రమాలు.. నిజమేనా.?..**



**మంచిర్యాల, జూన్ 20 ( సిరి న్యూస్ )**

ఒకప్పుడు పచ్చని మామిడి తోటలతో కళకళలాడిన మంచిర్యాల జిల్లా నెన్నెల్ మండలంలోని చిత్తాపూర్, ఆవడం, భగీరథపేట్ పరిసర ప్రాంతాలు ప్రస్తుతం చెట్ల మారణహోమంతో ఆందోళనకర దృశ్యంగా మారుతున్నాయి. తెలంగాణలోనే అత్యధికంగా మామిడి తోటలు విస్తరించి ఉన్న ఈ ప్రాంతంలో వందలాది ఎకరాల పాత తోటలను యంత్రాలతో నేలమట్టం చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. దశాబ్దాలుగా రైతులకు జీవనాధారంగా నిలిచిన 40 నుంచి 50 ఏళ్ల వయస్సు గల మామిడి చెట్లు వరుసగా నరికివేయబడుతుండటంతో గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

**రాత్రింబవళ్లు సాగుతున్న చెట్ల అక్రమ నరికివేత..**

స్థానికుల కథనం ప్రకారం చెట్ల నరికివేత కార్యక్రమం పగలు, రాత్రి తేడా లేకుండా కొనసాగుతోంది. భారీ యంత్రాల సహాయంతో చెట్లను కూల్చివేసి ట్రాక్టర్లు, లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున కార్యకలాపాలు సాగుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. పచ్చని తోటలు కనుమరుగవుతుండటంతో రైతులు, గ్రామస్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు..

**అధికారుల తనిఖీలు పేరుకేనా?..**

చెట్ల నరికివేతపై వరుస ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు కొన్ని ప్రాంతాలను పరిశీలించినట్లు సమాచారం. అయితే పరిశీలనలతోనే పరిమితమై, అక్రమాలకు అడ్డుకట్ట వేసే చర్యలు కనిపించలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. చెట్లను నరికేందుకు ఉపయోగిస్తున్న యంత్రాలను స్వాధీనం చేసుకోవడం గానీ, బాధ్యులపై కేసులు నమోదు చేయడం గానీ జరగకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది..

**వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారా?..**



నీరు, భూమి, చెట్ల సంరక్షణ కోసం అమల్లో ఉన్న వాల్టా చట్టం–2002 ప్రకారం చెట్ల తొలగింపునకు నిర్దిష్ట అనుమతులు తప్పనిసరి. కానీ చిత్తాపూర్ పరిసర ప్రాంతాల్లో వందలాది చెట్లు నరికివేస్తున్నా చర్యలు లేకపోవడం చట్ట అమలుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. కొద్ది చెట్లను తొలగించాలన్నా అనుమతులు అవసరమయ్యే పరిస్థితిలో, ఇంత భారీ స్థాయిలో చెట్ల నరికివేత కొనసాగుతున్నా అధికారులు మౌనం పాటించడం విమర్శలకు దారితీస్తోంది..

**రాజకీయ అండదండలతోనే అక్రమాలా?..**

గ్రామస్థుల ఆరోపణల ప్రకారం కొందరు ప్రభావశీల వ్యక్తుల ప్రోత్సాహంతోనే ఈ అక్రమాలు జరుగుతున్నాయనే ప్రచారం స్థానికంగా జోరందుకుంది. రాజకీయ మద్దతు ఉండటంతోనే సంబంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై పారదర్శక విచారణ జరిపి వాస్తవాలు వెలికితీయాలని ప్రజలు కోరుతున్నారు..

**పర్యావరణ సమతౌల్యానికి పెను ముప్పు..**

దశాబ్దాలుగా పెరిగిన మామిడి చెట్లు కేవలం రైతులకు ఆదాయ వనరే కాకుండా పర్యావరణ సమతౌల్యానికి కీలక ఆధారంగా నిలుస్తాయి. చెట్ల నరికివేతతో భూగర్భ జలాలు తగ్గిపోవడం, ఉష్ణోగ్రతలు పెరగడం, పక్షులు మరియు ఇతర జీవరాశులకు ఆశ్రయం లేకపోవడం వంటి తీవ్ర ప్రభావాలు కనిపించే అవకాశం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న తరుణంలో ఈ తరహా చర్యలు భవిష్యత్తులో మరింత ప్రమాదకర పరిస్థితులకు దారితీయవచ్చని అంటున్నారు..

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్..**

అక్రమ చెట్ల నరికివేతను తక్షణమే నిలిపివేసి, పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా చట్టాలను కఠినంగా అమలు చేయాలని కోరుతున్నారు. పచ్చని తోటలతో ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతాన్ని కాపాడేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు..

**చిత్తాపూర్‌లో పర్యావరణ హత్య.. సిరి న్యూస్ ప్రత్యేక కథనం.. హాట్ టాపిక్..**

చిత్తాపూర్‌లో జరుగుతున్న చెట్ల మారణహోమం వ్యవహారం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పర్యావరణాన్ని ప్రమాదంలోకి నెట్టే ఈ వ్యవహారంపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. చెట్ల నరికివేత వెనుక అసలు కారణాలేంటి.? బాధ్యులు ఎవరు.? మరి అధికారులు ఏ విధంగా స్పందిస్తారు.? చట్టపకరం చర్యలు ఎలా ఉండబోతున్నాయి.? అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందా.? అనే అంశాలపై మరిన్ని ఆధారాలతో. సిరి న్యూస్ తదుపరి సంచికలో కొనసాగుతుంది.






# మహిళా సాధికారతకు మహిళా సభలు దోహదం

- **నల్లవల్లిలో మహిళా సభ నిర్వహణ**
- **ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై కీలక నిర్ణయం**
- **ప్లాస్టిక్ రహిత గ్రామంగా నల్లవల్లి తీర్మానం**

**గుమ్మడిదల, జూన్ 20 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి గ్రామంలో శనివారం గ్రామ సర్పంచ్ కొరివి రాణి సురేష్ అధ్యక్షతన, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మహిళా సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో ఉమాదేవి హాజరై మహిళా సంక్షేమం, గ్రామాభివృద్ధిలో మహిళల పాత్రపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొరివి రాణి సురేష్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా సాధికారత, మహిళల హక్కులు, ఆరోగ్యం, పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, మహిళా భద్రత, స్వయం సహాయక సంఘాల పనితీరు వంటి పలు అంశాలపై సభలో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధిస్తూ మహిళా సభలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని



సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోచయ్య, వార్డు సభ్యులు రజని జితేందర్, కమ్మరి రాము, మంజుల అశోక్ గౌడ్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలి..

- **సర్కారు బడుల్లో వసతులు కల్పించాలి**
- **విద్యాధికారికి బీఆర్ఎస్వీ నేతల వినతి**

**సంగారెడ్డి, జూన్ 20 (సిరి న్యూస్):**

సంగారెడ్డి మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా వసూలు చేస్తున్న అధిక ఫీజులను తక్షణమే నియంత్రించాలని, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులు శనివారం మండల విద్యాధికారికి ఒక సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా సహ సమన్వయకర్త రాజేందర్ నాయక్ మాట్లాడుతూ మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులను ఇష్టారాజ్యంగా పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా దోచుకుం



టున్నాయని మండిపడ్డారు. తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించి మంచి భవిష్యత్తు అందించాలని ఆశపడే పేద, మధ్యతరగతి కుటుంబాల బలహీనతలను ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు వ్యాపారంగా మార్చుకున్నాయని నాయకులు ఆరోపించారు. విద్యా చట్టాల ప్రకారం ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని నియంత్రించాల్సిన పూర్తి బాధ్యత విద్యా శాఖ అధికారులపైనే ఉందని గుర్తుచేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మరోవైపు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు లేకపోవడం వల్ల సామాన్య విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు విమర్శించారు. ప్రభుత్వ బడులలో తాగునీరు, తగినన్ని తరగతి గదులు, మరుగుదొడ్లు మరియు ఇతర కనీస సౌకర్యాల కొరతను అధికారులు తక్షణమే పరిశీలించి వాటిని పరిష్కరించాలని కోరారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ఈ రెండు ప్రధాన సమస్యలపై తగిన చర్యలు తీసుకోని పక్షంలో, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టి పోరాటాన్ని ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థి విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

# బొంతపల్లి ఆలయ పాలకవర్గం ఏర్పాటుపై కొనసాగుతున్న ఉత్కంఠ

- మూడు నెలలైనా కొత్త కమిటీపై స్పష్టత కరువు
- నూతన కమిటీలో చోటు కోసం ఆశావహుల ఎదురుచూపులు
- దేవాదాయ శాఖ నిర్ణయంపై భక్తుల దృష్టి
- కొత్త పాలకవర్గం కోసం ఎదురుచూస్తున్న భక్తులు
- బొంతపల్లి ఆలయ కమిటీపై దేవాదాయ శాఖ నిర్ణయం కోసం నిరీక్షణ



**గుమ్మడిదల, జూన్ 19 (సిరి న్యూస్):**

ప్రసిద్ధ శైవ క్షేత్రంగా పేరుగాంచిన బొంతపల్లి శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయ నూతన పాలకవర్గం ఏర్పాటు అంశం ప్రశ్నార్థకంగా మారింది. ఆలయ పాలకవర్గం పదవీకాలం ముగిసి మూడు నెలలు కావస్తున్నప్పటికీ, ఇప్పటి వరకు నూతన కమిటీ ఏర్పాటు విషయంలో స్పష్టత లేకపోవడంతో భక్తులు, స్థానిక నాయకులు, ఆశావహుల్లో ఆసక్తితో పాటు ఆందోళన నెలకొంది.

**ముగిసిన పాత పాలకవర్గం**

గత పాలకవర్గం పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరిలో ముగిసింది. అయితే మార్చి నెలలో నిర్వహించిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల దృష్ట్యా పరిపాలనా సౌలభ్యం కోసం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అప్పటి పాలకవర్గానికే బాధ్యతలు అప్పగించారు. బ్రహ్మోత్సవాలు ముగిసి మూడు నెలలు గడిచినా నూతన పాలకవర్గం నియామకంపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడక పోవడం చర్చనీయాంశంగా మారింది.

**ఆలయ అభివృద్ధికి పాలకవర్గం అవసరమే**

ఆలయ అభివృద్ధి, ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణ, భక్తులకు మెరుగైన సేవలందించడంలో పాలకవర్గాల పాత్ర కీలకమని భక్తులు పేర్కొంటున్నారు. ఆలయ నిర్వహణలో పారదర్శకత, అభివృద్ధి కార్యక్రమాల అమలు, భక్తుల సౌకర్యాల విస్తరణ కోసం నూతన కమిటీని త్వరగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాదాయ శాఖ పరిధిలోని పలు ఆలయాలకు కమిటీల నియామక ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ, బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయ కమిటీ విషయంలో మాత్రం జాప్యం కొనసాగుతోందని స్థానికులు చెబుతున్నారు.

**ఆశావహుల ఎదురుచూపులు..**


**దేవాదాయ శాఖ నిర్ణయంపై దృష్టి**

దేవాదాయ శాఖ మార్గదర్శకాల ప్రకారం కొత్త పాలకవర్గంలో అవకాశం కోసం పలువురు ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ఆలయ కమిటీలో సేవ చేసే అవకాశం లభిస్తే స్వామివారి ఆలయ అభివృద్ధికి తమ వంతు సేవలందించాలని భావిస్తున్న కార్యకర్తలు, సామాజికవేత్తలు పాలకవర్గం నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతున్నారు. కమిటీ ఏర్పాటు ఆలస్యం కావడంతో ఆశావహుల్లో నిరాశ వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా, నూతన పాలకవర్గం నియామకానికి సంబంధించి దేవాదాయ శాఖ అధికారులు త్వరలో నిర్ణయం తీసుకుని నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

# ఆత్మీయ పలకరింపుల నడుమ..

- జర్నలిస్ట్ పటేరి రాము, పోలీస్ వినోద్ రావుల జన్మదిన వేడుకలు.





**రామాయంపేట, జూన్ 20 (సిరి న్యూస్)**

రామాయంపేటలో సమాజ సేవకులైన పోలీస్, జర్నలిస్టులకు ఉన్న ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా.. టీవీ9 రిపోర్టర్, రామాయంపేట ప్రెస్ క్లబ్ జనరల్ సెక్రెటరీ పటేరి రాము, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ జాదవ్ వినోద్ రావుల జన్మదిన వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. స్థానిక ఆమెుఘ్ గ్రాండ్ హోటల్ వేదికగా జరిగిన ఈ వేడుకలో పలువురు పాత్రికేయ మిత్రులు పాల్గొని వారిపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ వేడుకకు టియుడబ్ల్యుజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డిజి శ్రీనివాస్ శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, వృత్తిపరమైన బాధ్యతలను నిర్వహిస్తూనే, సమాజ హితం కోసం పాటుపడుతున్న రాము, వినోద్‌ల సేవలను కొనియాడారు. వారు మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని, ఉత్తమ భవిష్యత్తును కలిగి ఉండాలని ఆకాంక్షించారు. రామాయంపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బసన్నపల్లి మల్లేశం మాట్లాడుతూ, జర్నలిస్టుల మధ్య ఉన్న ఐక్యతకు, పోలీస్, మీడియా మిత్రుల మధ్య ఉన్న సమన్వయానికి ఇటువంటి వేడుకలే నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం రాము, వినోద్‌లు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ తమ ఆనందాన్ని పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కర్రె నరేందర్, రంగ రాజకిషన్, సార్గు నర్సింలు, సబావత్ సర్దార్ నాయక్ తదితరులు పాల్గొని రాము, వినోద్‌లకు శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు.

# రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

**ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి..**

**మానకొండూర్ ప్రతినిధి, జూన్ 20, (సిరి న్యూస్) :**

గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్టు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. శనివారం బెజ్జంకి మండలం దేవక్కపల్లి, పోతారం, పెరుకబండ గ్రామాల్లో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి మెరుగైన రహదారులు ఎంతో అవసరమన్నారు. ప్రజలకు రాకపోకల సౌకర్యం కల్పించడంతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ముఖ్యంగా గ్రామాల మధ్య కనెక్టివిటీ పెంచడంతో అభివృద్ధికి బాట వేయడమేనని ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో దేవక్కపల్లి గ్రామ సర్పంచ్ నేరెళ్ల వెంకటలక్షి రాజయ్య, పోతారం గ్రామ సర్పంచ్ సింగిరెడ్డి రాజేందర్ రెడ్డి,పెరుకుబండ సర్పంచ్ కర్రావుల స్వప్న, ఆయా గ్రామాల పార్టీ ధ్యక్షులు గ్రామశాఖ అధ్యక్షులు పంజాల అజయ్, కె. బాబు, కె.తిరుపతి, బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డితోపాటు పలువురు సర్పంచులు, పార్టీ గ్రామాధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. పరామర్శలుబెజ్జంకి మండలం పాపన్నపల్లి, బెజ్జంకి ఎక్స్ రోడ్డు, గాగిల్లాపూర్ గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతులకు నివాళులర్పించడమే కాకుండా వారి కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు.

# కాంగ్రెస్ బలోపేతంలో యూత్ కాంగ్రెస్ కీలకం

- బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై యూత్ కాంగ్రెస్ విస్తృత పోరాటం
- ప్రభుత్వ సంక్షేమ పథకాలను నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలి..
- గ్రేటర్ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ నాయకులకు ప్రాధాన్యత..
- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి

**హైదరాబాద్ బ్యూరో, జూన్ 20, (సిరి న్యూస్) :**

హైదరాబాద్ లోని చైతన్యపురి డివిజన్ పరిధిలోని గణేష్ ఫంక్షన్ హాల్‌లో రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఖాలీద్ తో కలిసి రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా యువజన కాంగ్రెస్ చేపట్టిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను యువజన కాంగ్రెస్ శ్రేణులు ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. అలాగే లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ సూచనలు, భారతీయ యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఉదయభాను చిబ్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రజా సమస్యలపై నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. రాబోయే గ్రేటర్ ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని, టికెట్ల కేటాయింపులో కూడా యువజన కాంగ్రెస్ కు ప్రాధాన్యం లభిస్తుందని, కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర సహా ఇంచార్జ్ కె.ఆర్. భవ్య, రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు యరమల రామచంద్రారెడ్డి, శ్యామ్ చరణ్ రెడ్డి, సాగర్, విద్యారెడ్డి, పాలడుగు నాగార్జున, శివకుమార్, సుభాన్ యాదవ్, దళపతి తదితరులు పాల్గొన్నారు.

## బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ

**అమీన్‌పూర్, జూన్ 20, (సిరి న్యూస్):**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని చారిత్రాత్మక బీరంగూడ గుట్టపై వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి దంపతులు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ దంపతులు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి చేరుకున్న మంత్రి, ఎంపీ దంపతులకు వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. మంగళవాయిద్యాలు, సన్నాయి మేళాల నడుమ గర్భగుడిలోకి ఆహ్వానించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని వారు ప్రార్థించారు.

**ఆలయ కమిటీ ఘన సత్కారం**

పూజల అనంతరం మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణలతో పాటు పటాన్‌చెరు కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ దంపతులను ఆలయ ఈవో దేవానందం, ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్ శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

**ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం**

ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయంలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. ఆలయ సమగ్ర అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, శివానందం, ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గుమ్మడిదల ఎస్సైగా అరుణ్ కుమార్ గౌడ్ బాధ్యతల స్వీకరణ

**గుమ్మడిదల, జూన్ 20 (సిరి న్యూస్):**




గుమ్మడిదల మండల పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా అరుణ్ కుమార్ గౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు గుమ్మడిదలలో ఎస్సైగా విధులు నిర్వహించిన లక్ష్మీకాంత్ రెడ్డి బదిలీపై వెళ్లడంతో, వికారాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న అరుణ్ కుమార్ గౌడ్‌ను గుమ్మడిదలకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన సిబ్బందితో సమావేశమై స్థానిక పరిస్థితులు, శాంతిభద్రతల అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అరుణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, అక్రమ వ్యాపారాలు, నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని ఆయన కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకంగా సేవలు అందిస్తామని పేర్కొన్నారు. మండలంలో శాంతి, సామరస్య వాతావరణాన్ని కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# తూప్రాన్ అక్షర ఇంటర్నేషనల్ స్కూల్లో యోగా వేడుకలు

**తూప్రాన్, జూన్ 20, (సిరి న్యూస్):**

తూప్రాన్ అక్షర స్కూల్లో శనివారం యోగా వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల మైదానంలో విద్యార్థుల ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. పలు ఆసనాలు వేసి యోగా విశిష్టతను తెలియజేసారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఉదయశ్రీ విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను తెలియజేశారు.

# పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసిన సాయికిరణ్



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 20, (సిరి న్యూస్) :**

127 – రంగారెడ్డి నగర్ డివిజన్ కు చెందిన బిఆర్ఎస్ నాయకులు ఎర్వ సాయి కిరణ్ (బంటి) తన పుట్టినరోజు సందర్భంగా చింతల్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రజాసేవలో మరింత ముందుకు వెళ్ళాలని ఎర్వ సాయికిరణ్ ను ఎమ్మెల్యే ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేటలో ఆర్.సి.సి తూరల ఏర్పాటును పర్యవేక్షించిన సర్పంచ్ పగడాల



**దమ్మపేట, జూన్ 20, (సిరి న్యూస్):** దమ్మపేట గ్రామపంచాయతీ 9 వ వార్డు కొత్తపేటలో సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, వార్డు సభ్యులు భవాని కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం రోడ్డు జంక్షన్ల వద్ద మురుగునీరు, వర్షాకాలం దృష్ట్యా వరద నీరు వెళ్లడానికి ఆర్.సి.సి పైపులను జెసిబి సహాయంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వార్డులో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటి చేసుకుంటూ, పంచాయతీ పరిధిలో ముఖ్యంగా మౌలిక వసతులు రోడ్డు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ తదితర ప్రజా సమస్యల పై పాలకవర్గ సభ్యులు అయిన మేము అందరమూ నిరంతరం కృషి చేస్తున్నాము అని తెలియజేశారు. కార్యదర్శి బండి అనంత్ కుమార్, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, రూపా రాంబాబు, దారా రాము పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చదువు జ్ఞానాన్ని పెంచుతుంది

## ఎంఈఓ ప్రవీణ్ బాబు

**మిరుదొడ్డి, జూన్ 20, (సిరి న్యూస్):**

చదువు జ్ఞానాన్ని పెంచుతుందని ఎంఈఓ ప్రవీణ్ బాబు అన్నారు. శనివారం మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ రమేష్, ఉప సర్పంచ్ బాల కిషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగులు, వాటర్ బాటిల్స్, ప్యాడ్ లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత మార్గాన్ని ఎంచుకోవడానికి చదువు ఎంతో ముఖ్యమని అన్నారు. ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలకు పంపించాలన్నారు. బడి బయట పిల్లలను బడిలో చేర్పించి వారిని విద్యావంతులుగా తీర్చిద్దడానికి గ్రామంలో పాఠశాలలు ఉన్నాయని తెలియజేశారు. ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రతి ఒక్కరు సద్వినియం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# ఈ లడ్డూ రోజుకు ఒకటి తింటే చాలు

ప్రస్తుత పరుగుల ప్రపంచంలో పోషకాహార లోపం అతి పెద్ద సమస్యగా మారుతుంది. పని ఒత్తిడి వల్లో, సమయం లేకనో చాలా మంది రెడిటు ఈట్ ఆహారం వైపు, ఫాస్ట్ ఫుడ్ వైపు అడుగులు వేస్తున్నారు. అవి తినడం వల్ల ఆ కాసేపు నోటికి రుచికరంగా, ఆ క్షణానికి తినాలి అన్న పని ముగుస్తుంది. కానీ మనకు ఆరోగ్య పరంగా ఎటువంటి మేలు ఉండదు. పైగా అనారోగ్య కారకాలు అధికమైపోతాయి. ఈ విషయం అందరికీ తెలుసుకు. కానీ పని ఒత్తిడి బాస్.. ఫుడ్ ప్రిపేర్ చేసుకునే సమయం లేకనే ఇలా చేస్తున్నాం. లేకపోతే ఈ ఫుడ్ తినడం మాకు మాత్రం ఇష్టామా ఏంటి అని సమాధానం చెప్తారు. అయితే ఇకపై హెల్తీ ఫుడ్ కోసం వంటగదుల్లో ప్రతి రోజూ యుద్ధాలు చేయాల్సిన అవసరం లేదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. పిజ్జాలు, బర్గర్, ఫ్రైడ్ రైస్‌లు వంటి జంక్ తినడం వల్ల ఏర్పడిన పోషకాల లోపాలను రోజుకు ఒక్క లడ్డూ తినడం ద్వారా తగ్గించుకు కోవచ్చంటున్నారు. ఈ లడ్డూ ప్రతి రోజూ ఒకటి తింటే ఎటువంటి పోషకాహార లోపాలు ఉన్నా తగ్గుతాయని, వాటి వల్లు వచ్చేర సమస్యలు కూడా దూరమవుతాయని నిపునులు అంటున్నారు. అవే మల్టీసీడ్స్ లడ్డూలు. మరి వీటి రెసిపీ ఏంటో తెలుసా.. రండి చూసేద్దాం.

### కావలసిన పదార్థాలు

అవిసె గింజలు రెండు స్పూన్లు
గుమ్మడి గింజలు రెండు స్పూన్లు
సన్ ఫ్లవర్ సీడ్స్ రెండు స్పూన్లు
నువ్వులు రెండు స్పూన్లు
ఓట్స్ పావు కప్పు
ఖర్జూరాలు పది
యాలకుల పొడి చిటికెడు
నెయ్యి ఒక స్పూను

### మల్టీ సీడ్స్ లడ్డూ రెసిపీ

1. స్టవ్ మీద కళాయి పెట్టి అవిసె గింజలు, గుమ్మడి గింజలు, పొద్దు తిరుగుడు గింజలు, నువ్వులు, ఓట్స్ వంటివన్నీ కూడా వేయించుకొని మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి.
2. స్టవ్ మీద కళాయి పెట్టి ఒక స్పూన్ నెయ్యిని వేయాలి.
3. ఆ నెయ్యిలో ఖర్జూరాలను సన్నగా తరిగి వేయించుకోవాలి.
4. ఆ ఖర్జూరం మిశ్రమంలోనే ముందుగా రుబ్బి పెట్టుకున్న పొడిని కూడా వేసి బాగా కలపాలి.
5. అలాగే యాలకుల పొడిని కూడా వేయాలి.
6. ఈ మొత్తం మిశ్రమాన్ని స్టవ్ ఆఫ్ చేసి మొత్తం మిశ్రమాన్ని చల్లార్చాలి.
7. ఇప్పుడు ఈ మిశ్రమంలో అవసరమైతే కొంచెం నెయ్యిని వేసుకొని లడ్డూల్లా చుట్టుకోవాలి.
8. అంతే టేస్టీ మల్టీ సీడ్స్ లడ్డు రెడీ అయినట్టే.
9. వీటిని సీసాలో ఉంచి మూత పెట్టాలి. ప్రతిరోజూ ఒకటి తింటే చాలు, మీ శరీరానికి కావలసిన పోషకాలు అందుతాయి.

### వీటి వల్ల కలిగే ప్రయోజనాలు


మల్టీ సీడ్స్ లడ్డు రెసిపీలో మనం అవిస గింజలను వాడాము. ఇందులో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ ను పెంచే గుణాలు ఉన్నాయి. అవిసె గింజలను ప్రతిరోజూ ఆహారంలో భాగం చేసుకోమని కూడా చెబుతారు. ఇవి జీర్ణ క్రియను మెరుగుపరుస్తాయి. క్యాన్సర్ తో పోరాడుతాయి. మధుమేహాన్ని నియంత్రిస్తాయి. రక్తపోటును కూడా అదుపులో ఉంచుతాయి. చర్మాన్ని మెరిసేలా చేస్తాయి. అలాగే ఖర్జూరాన్ని కూడా ఎక్కువగానే వినియోగించాము. ఈ ఖర్జూరంలో కాల్షియం, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, ప్రోటీన్, ఫైబర్, విటమిన్స్ వంటివి పుష్కలంగా ఉంటాయి.

ఖర్జూరంలో ఇనుము కంటెంట్ అధికంగా ఉంటుంది. కాబట్టి రక్తహీనత సమస్యతో బాధ పడుతున్న వారు ఖర్జురాన్ని ఆహారంలో భాగం చేసుకుంటే ఉత్తమం. ప్రతిరోజూ రెండు ఖర్జూరాలు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు కూడా చెబుతున్నారు. అలాగే గుమ్మడి గింజలు, సన్ ఫ్లవర్ సీడ్స్, నువ్వుల్లో కూడా ఆరోగ్యానికి కావాల్సిన ఎన్నో విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇవన్నీ కూడా మనకు పోషకాహార లోపం లేకుండా చేస్తాయి. కాబట్టి మల్టీ సీడ్స్ లడ్డును కచ్చితంగా మహిళలు పిల్లలు తినేందుకు ప్రయత్నించాలి.





## గోవా ట్రిప్ ప్లాన్ చేస్తున్నారా..
# ఈ విషయాలు తెలుసుకోండి..





గోవా..
దాదాపు
ప్రతి ఒక్కరూ
వెళ్లాలని అనుకునే
పర్యాటక ప్రదేశంలో.
దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా గోవాకు టూరిజంలో ప్రత్యేక స్థానం ఉంది. ప్రతి రోజూ వందల మంది విదేశీయులు గోవాను వీక్షిస్తుంటారు. ఇక్కడకి వెళ్లాలని యువత తెగ ఉర్రూతలూగుతుంటారు. అక్కడి బీచ్‌లకు వరల్డ్ ఫేమస్. అక్కడి చల్లని గాలులను ఆస్వాదించడం మనకు చాలా ఆహ్లాదాన్ని అందిస్తుంది. బీచ్‌లు, జలపాతాలు, అనేక అద్భుతమైన ఆటలు ఈ బీచ్ ను పర్యాటకంగా మార్చింది. అయితే చాలా మంది ఇక్కడికి డిసెంబర్, జనవరి నెలల్లో వెళ్లాలని అనుకుంటారు. అయితే అసలు గోవాకు వెళ్తే అక్కడ ఎంత ఖర్చు అవుతుంది, ఎప్పుడు వెళ్లాలి వంటి మరిన్ని విషయాలు తెలుసుకోకుండా వెళ్తే మాత్రం అక్కడ ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

### ఏ నెలల్లో వెళ్లాలి?

ప్రతి బీచ్ దగ్గర అందమైన అలంకరణలు, ప్రతిచోటా పార్టీలు ఏర్పాటు చేస్తారు. డిసెంబర్, జనవరి నెలల్లో గోవాకు ఎక్కువ మంది వస్తూ ఉంటారు. ఈ రెండు నెలల్లో ప్రతిదాని రేటు రెట్టింపు అవుతుంది. సాధారణ రోజుల్లో రూ.200 నుంచి రూ.250 అద్దెకు లభించే స్కూటీలు... డిసెంబర్ నెలలో రూ.500కు పైగా లభిస్తోంది. అదే సమయంలో హోటల్ గదుల ఛార్జీలు కూడా పెరుగుతాయి. సాధారణ రోజుల్లో రూ.1000కు లభించే ఈ గది డిసెంబర్, జనవరి నెలల్లో రూ.2000 వరకు ఉంటుంది. కాబట్టి జనవరి, డిసెంబర్ నెలల్లో బడ్జెట్ రెట్టింపు అవుతుంది. మిగతా నెలల్లో గోవా వెళ్లడం మంచిది.

### ఎంత ఖర్చు అవుతుంది?

గోవా వెళ్లాలనుకునే వారు చేతిలో పది వేల వరకు గోవాలో తిరగొచ్చు. పూర్తిగా పదివేల రూపాయలే అవుతుందని చెప్పలేము. సాధారణ నెలల్లో గోవా సంతృప్తిగా తిరగాలంటే చేతిలో 20 వేల రూపాయల నుంచి 30 వేల రూపాయల వరకు చేతిలో ఉండాల్సిందే. ఇక డిసెంబర్ నెలలో గోవా ట్రిప్‌ను పూర్తిగా ఆస్వాదించాలనుకుంటే చేతిలో 50 వేల రూపాయలు నుంచి 80 వేల రూపాయలు చేతిలో ఉంచుకోవాలి. అంత డబ్బు ఉంటే గోవాలో యాక్టివిటీస్ కూడా ఎంజాయ్ చేయొచ్చు. ఈ ఖర్చుతో మూడు రాత్రులు, నాలుగు పగళ్ళు ఉండొచ్చు.గోవాలో ఫేమస్ బీచ్ కలంగుట్ బీచ్. దీన్ని కచ్చితంగా చూడాల్సిందే. ఇక్కడి బీచ్ లోని సముద్ర జలాలు చాలా పారదర్శకంగా ఉంటాయి. ఇక్కడి సూర్యోదయం, సూర్యాస్తమయం చూసేందుకు చాలా అందంగా ఉంటాయి.పాత గోవాకు ఎంతో గొప్ప చరిత్ర ఉంది. ఇక్కడ వాస్తు శిల్పాలు అందంగా ఉంటాయి. పాత గోవా వారసత్వ సంపదగా చెప్పుకుంటారు. ఇక్కడ పాత చర్చిలు, పురాతన మ్యూజియంలు ఉంటాయి.గోవా రాజధాని పనాజీ ఎంతో అందంగా ఉంటుంది. ఇక్కడ దూద్ సాగర్ జలపాతం చూడముచ్చటగా ఉంటుంది. ఇది 320 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు నుంచి కిందకి పడుతు ఉంటుంది.









# పిల్లలకు తప్పక నేర్పించాల్సిన విషయాలేంటో తెలుసా

ప్రతి చిన్నారికి కూడా తొలి గురువులు తల్లిదండ్రులే. వారిని చూసే పిల్లలు చాలా విషయాలు నేర్చుకుంటారు. తొలి పలుకుల దగ్గర నుంచి తొలి అడుగుల వరకు తల్లిదండ్రుల ద్వారా నేర్చుకుంటారు. ఇలాంటి సమయాల్లోన్నే తల్లిదండ్రులు కూడా చాలా జాగ్రత్త వహించాలి. ప్రతి విషయాన్ని పిల్లలకు చాలా జాగ్రత్తగా నేర్పించుకోవాలి. చిన్నప్పుడు తల్లిదండ్రి నేర్పించే ప్రతి విషయం కూడా వారి వ్యక్తిగత ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయి. పిల్లలు ఉన్నతంగా ఆలోచించాలి అంటే ఇవి వారికి ఉపయోగపడతాయి. పిల్లల అభివృద్ధిలో పేరింగ్ చాలా కీలక పాత్ర పోషిస్తుంది. తల్లిదండ్రులు నేర్పించే అంశాలను బట్టే వారి నడవడిక ఉంటుంది. తల్లిదండ్రులందరూ తమ పిల్లలకు మంచి రోల్ మోడల్‌గా ఉండటం చాలా ముఖ్యం. ఎందుకంటే పిల్లలను చూసే తల్లిదండ్రులు చాలా విషయాలను నేర్చుకుంటారు. వారు పైకి ఉన్నతంగా ఎదగాలి అంటే తప్పకుండా మీరు సరైన విలువలు నేర్పించాలి.భవిష్యత్తులో మంచి వ్యక్తులుగా ఎదగాలని పిల్లలకు నేర్పించాలి. గొప్ప గొప్ప వ్యక్తుల జీవిత కథలను చిన్నప్పటి నుంచే వినిపించాలి. చిన్నారుల ముందు మంచిగా ప్రవర్తించాలి. తల్లిదండ్రులు తమ పిల్లల ముందు చేసే, చెప్పే లేదా ప్రవర్తించే వాటిని పిల్లలు మోడల్ చేస్తారు.పిల్లలు పెద్దయ్యాక ఎలా ప్రవర్తిస్తారు. పిల్లలకు ప్రాథమిక జీవన నైపుణ్యాలను నేర్పడంలో తల్లులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నట్లే, బయట ప్రపంచంలో వారికి సహాయపడే పాఠాలను పిల్లలకు నేర్పించడంలో తండ్రి ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. తండ్రులు తమ పిల్లలకు కూడా కచ్చితంగా మంచి విషయాలను నేర్పించాలి.



### ఇతరులను గౌరవించండి

తండ్రులు తమ పిల్లలకు నేర్పించవలసిన ముఖ్యమైన విషయాలలో ఒకటి ఇతరులను గౌరవించడం గురించి చెప్పాలి. తల్లిదండ్రులు ఇంట్లో ఒకరినొకరు గౌరవంగా చూసుకుంటే, పిల్లలు కూడా తమ చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరినీ గౌరవించడం ప్రారంభిస్తారు. వయస్సు లేదా ఇతర భేదాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ గౌరవించడం పిల్లలకు నేర్పించాలి.

తప్పులను అంగీకరించడం

తండ్రులు తమ పిల్లలకు తమ తప్పులను అంగీకరించమని ఎల్లప్పుడూ నేర్పించాలి. తండ్రి మొండిగా ఉండి తప్పులు ఒప్పుకోకుంటే పిల్లలకు కూడా ఇదే అలవాటు అవుతుంది. ఇంట్లో వాదనల సమయంలో కోపం చూపిస్తే పిల్లలు ఆ ప్రవర్తనను ఆదర్శంగా తీసుకుని, తమను తాము రక్షించుకునే అలవాటును పెంచుకుంటారు. పొరపాట్లను అంగీకరించడం వల్ల పిల్లలు జీవితంలో గొప్పవారు అవుతారని పిల్లలకు నేర్పించాలి.



### వైఫల్యానికి భయపడవద్దు

వైఫల్యాన్ని తప్పుగా లేదా చెడుగా చూడకూడదని పిల్లలకు నేర్పించడం చాలా ముఖ్యం. అపజయం జీవితంలో ఒక భాగమని, అపజయమే విజయానికి మొదటి మెట్టు అని పిల్లలకు నేర్పించాలి. అపజయం లేని విజయం గర్వాన్ని ఇస్తుందని పిల్లలకు నేర్పించాలి. అనుభవాలు నేర్పే పాఠాల గురించి గొప్పగా చెప్పాలి.ఓడిపోవడం వల్ల నష్టమేమీ లేదని తండ్రులు తమ పిల్లలకు ఎప్పుడూ నేర్పించాలి. వారు తిరస్కరణను ఎదుర్కోవటానికి ఇష్టపడరు లేదా భయపడతారు. కష్టపడి, నిరంతర శ్రమతో విజయం సాధించవచ్చని పిల్లలకు కూడా నేర్పించాలి. ఓడిపోయినా, గెలిచినా గెలుపై వైపునకు సాగాలి అని పిల్లలకు పాఠాలు చెప్పాలి. అప్పుడే వారు బాగుపడతారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.